Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 28 - No.7

May 2022



## ఆత్మీయ నాయకత్వం

4లో

ఎడిటోరియల్



# మాదిరి నాయకత్వం

యుఇయస్ఐ పితరులలో ఒకరైన డా॥ నార్టన్ స్టెరెట్, ఎలోయిస్ స్టెరెట్ దంపతులు తమ విలక్షణ నాయకత్వం ద్వారా ఎంతోమందిని శిష్యులుగా, నాయకులుగా తీర్చిదిద్దారు. నాయకుడంటే ఎలా ఉండాలో ఒక మాదిరిని తమ జీవితం ద్వారా చూపించారు. వారి సేవా జీవితంలో కొన్ని విషయాలును చూద్దాం.

**1. క్రమశిక్షణ - ఖచ్చితత్వం:** స్టెరెట్‌గారు చాలా వ్యవస్థీకృత జీవితం గడిపారు. నియమాలు నిక్కచ్చిగా పాటించేవారు. ముందున్న దేవుని పని నిమిత్తం తన శరీరాన్ని కఠిన మైన క్రమశిక్షణకు లోబరుచుకొన్నాడు. తన దేవునిని ఎంతగా ప్రేమించాడంటే ఏ రోజైనా ఆలస్యంగా నిద్రపోయినప్పటికీ దేవునితో సమయాన్ని గడపడానికి వేకువజామున 4:30కే లేచేవాడు. టైమ్‌టేబుల్ వేసుకొని ఏ సమయంలో ఏమి చేయ్యాలో అది ఖచ్చితంగా చేసేవాడు. ప్రతిదినం, వారం కోసం పరిపూర్ణ షెడ్యూల్ ఆయనకు ఉండేది. శుక్రవారాన్ని తన కుటుంబంతో అర్థవంతంగా గడపడానికి కేటాయించి వారితో సరదాగా గడిపేవాడు. ఏ విషయంలోనైనా తగిన శ్రద్ధచూపడం అతని జీవితంలో ముఖ్య లక్షణం.

**2. క్రమబద్ధమైన ప్రార్థనా జీవితం:** స్టెరెట్‌గారి ప్రార్థనా జీవితం ఎంతో పద్ధతిగా ఉండేది. వాళ్ళ జీవితంలో అధికభాగం (1939-1975) భారతదేశంలోనే గడిపారు. పదవీ విరమణ తరువాత కూడా విద్యార్థుల పరిచర్య కోసం ప్రార్థనా సపోర్ట్‌ను లేవదీశారు. ప్రభువుకోసం పని చేస్తున్నప్పుడు మూడు ప్రాథమిక విషయాలు గుర్తుంచుకోవాలి అంటాడు. దేవునికోసం ప్రేమ, నశించిపోయే ఆత్మల పట్ల తీవ్ర వాంఛ మరియు దేవుడు మనల్ని ఉపయోగించుకోవడానికి వీలుగా స్వంత చిత్తం ఆయనకు స్వాధీనం చేయడం. స్టెరెట్‌గారు ఈ ప్రాథమిక సత్యాలను తన జీవితంలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు.

**3. సామాన్య జీవితం:** 1939 నుండి 1948 వరకు స్టెరెట్ దంపతులు ఉత్తర ఇండియాలోని కాన్పూర్‌లో ఉన్నారు. ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో చాలాకాలం వారు గుడారాలలో నివసించారు. వారు కనీస సౌకర్యాలతో ఉంటూ సంతృప్తి చెందేవారు. నార్టన్ గారు చెట్లకింద కూర్చొని టైప్ చేసుకొనేవారు.

**4. సేవక నాయకత్వం:** యుఇయస్ఐ ఉద్యమం ప్రారంభించబడిన తర్వాత భారతీయ జనరల్ సెక్రటరీ పి.టి.చాందపిళ్ల గారికి అప్పగించి ఆయన నాయకత్వంకింద 16 సంవత్సరాలు పనిచేశారు. "ఆయన యుఇఎస్ఐని విడిచి వెళ్ళే వరకు నాతో కలసి నమ్మకంగాను, బాధ్యతగాను ఒక సాధారణ స్టాఫ్‌లా పనిచేశారు" అని చాంద గుర్తు చేసుకొన్నారు. సత్కీర్తిరావు గారు వీరి గురించి చెబుతూ "ఎలోయిస్ మాకు పాత్రలను ఏవిధంగా శుభ్రం చేయాలో నేర్పించారు, డా. స్టెరెట్ గారు మరుగుదొడ్లు ఎలా శుభ్రం చేయాలో నేర్పించారు" అని వ్యాఖ్యానించారు.

**5. బైబిల్ అధ్యయనానికి పురికొల్పు:** "మీరు లేఖనాలలోని ఏ భాగాన్నైనా, మీ మాతృభాషలో కనీసం 10 సార్లైనా చదవకపోతే, మీరెప్పుడూ అర్థం చేసుకోలేరు. నేను బైబిల్‌ని బోధించటానికి ఇష్టపడతాను, కానీ నా హృదయంలో భారం ఏంటంటే ప్రజలు తమకుతామే బైబిల్‌ని అధ్యయనం చేయుటకు ప్రోత్సహపర్చటమే". అని చెప్పేవాడు.

**6. కోటగిరి హైఫీల్డ్:** నీలగిరిలోని కోటగిరిలో హైఫీల్డ్, యుఇయస్ఐ స్టడీసెంటర్ సుందరమైన ఎనిమిది ఎకరాల స్థలాన్ని యుఇయస్ఐకి ఇచ్చేశారు. దేవుడు ఎలోయిస్ స్టెరెట్‌గారికి ఒక వాగ్దానమిచ్చారు "ఈ స్థలములో నా సమాధానముంచెదను" (హగ్గయి 2:9).

**7. సలహా పరిచర్య:** యూత్ ఫర్ క్రైస్ట్ యొక్క ఆర్థిక పరిస్థితి క్షీణ దశలో ఉండేది. సంస్థ యొక్క భారాన్ని మోస్తున్న విక్టర్ మనోహరం గారు వైయఫ్‌సితో ఒప్పందం చేసికొన్న 5 సంవత్సరాల కాలపరిమితిని రద్దు చేసికొని సెలవు తీసుకోవాలని ఆలోచిస్తూ ఈ విషయాన్ని స్టెరెట్ దంపతులతో పంచుకొన్నాడు.

ఒకరోజు ఉదయాన్నే స్టెరెట్ దంపతులు విక్టర్ మనోహరం ఇంటికి వెళ్ళి "విక్టర్, మేము నీ కొరకు ఎంతో భారంతో ప్రార్థించాము. నీయొక్క పరిపాలనా సంబంధమైన బాధ్యతలలో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నావని మాకు తెలుసు. నీ ఆర్గనైజేషన్‌కి కావసినన్ని నిధులున్నట్లయితే నీవు ఉద్యోగంనుండి మారాలనుకుంటావా? అని విక్టర్ ఆలోచించేలా చేశారు.

ఈ ప్రశ్న విక్టర్ మనోహరం గారిని బాగా ఆలోచించేలా చేసి, తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొనేలా చేసింది. దేవుడు ఆయనతో స్పష్టంగా మాట్లాడాడు. తన అవసరాలన్నింటి కోసం దేవునిపై ఆధారపడాలని, ఆర్గనైజేషన్‌కి పూర్తి నిధులున్నప్పుడే తాను ఆర్గనైజేషన్‌ను విడిచిపెట్టాలని, అప్పటివరకు విడిచిపెట్టేది లేదని తీర్మానించుకొన్నాడు. ఈ సవాలు ఫలితంగా ఆయన యూత్ ఫర్ క్రైస్ట్‌లోనే మరో 40 సంవత్సరాలు పరిచర్య చేశారు.

డా॥ నార్టన్ స్టెరెట్, ఎలోయిస్ స్టెరెట్‌లలో – 'సర్వెంట్ లీడర్‌షిప్, షెపర్డ్ లీడర్‌షిప్, షేర్డ్ లీడర్‌షిప్, స్టీవర్డ్ లీడర్‌షిప్' మనకు కనిపిస్తాయి. ఇలాంటి నాయకులను మాదిరిగా తీసుకొని మన పరిచర్యలో ఇలాంటి వారు తయారయ్యేటట్లు ప్రార్థిద్దాం, పనిచేద్దాం.

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల



Vol. 28, No.7 May 2022
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

June : Problems of believing students
July : Imitating Christ
August : Patriotism

**Note:** Please send your writeups on or before
**10th of every month**

## ఆత్మీయ నాయకుడు



మనుషులు రెండు రకాలు. దీనికి శాస్త్రీయంగా ఎలాంటి ఆధారాలు లేకపోయినా ఇది మౌలికంగా, సాంఘికంగా జరిగే విభజన. నడిపించేవారు కొందరైతే, నడిచేవారు ఇంకొందరు. సంఘంలో, సమాజంలో నడిపించే వారు తక్కువ సంఖ్యలో ఉంటే, నడిచేవారు లక్షల్లో ఉంటారు. నడిచే కేటగిరిలో చేరేందుకు పెద్దగా ప్రత్యేకతలేవీ అవసరం ఉండదు. నడిపించే స్థాయి పొందాలంటే మాత్రం భిన్నమైన లక్షణాలు ఉండితీరాలి. లక్షలమంది వెనక నడుస్తూ ఉంటే ముందు కాగడా తీసుకొని నడవడానికి ఎంతో సత్తాకావాలి.

క్రైస్తవ సంఘాల్లో, సంస్థల్లో నాయకులు ఎంతోమంది ఉన్నారు. వీరిని ఆత్మీయ నాయకులని అంటాం. ఒక భక్తుడు ఇలా అంటాడు “ఒక ఆత్మీయ నాయకుడు తన జీవితంలో మొదటి స్థానం ఆధ్యాత్మికతకు, రెండవస్థానం నాయకత్వానికి ఇవ్వాలి”. ఒక విశ్వాసిలో నాయకత్వ లక్షణాలు ఎన్ని ఉన్నా తన జీవితంలో ఆధ్యాత్మికతకు మొదటిస్థానం లేకపోతే లోకంలో ఉన్న నాయకునికి అతనికి తేడా ఏమీ ఉండదు. ఆత్మీయ నాయకుడు దేవుని వాక్యం ప్రకారం నడుచుకోవాలి. వాక్యం ఆ నాయకుని క్రియల్ని, ఆలోచనల్ని ప్రభావితం చేయాలి. నిర్ణయాల కోసం దేవుని సన్నిధిలో కనిపెట్టాలి. అప్పుడే ఆ నాయకుని వ్యక్తిగత జీవితం, పని అత్యున్నత విలువలను, ప్రభావాన్ని కలిగి ఉంటుంది. మనం ఆధ్యాత్మిక నాయకులమేనా?

*దేవుని కొరకు గొప్పకార్యములు చేసిన పరాక్రమశాలులు అందరూ బలహీనమైన మనష్యులే ఎందుచేతననగా దేవుడు వారితో ఉన్నాడని వారు నమ్మారు. – జె. హడ్సన్ టేలర్*

## లోపలి పేజీల్లో...

❄ మాదిరి నాయకత్వం - 2
❄ ఆత్మీయ నాయకత్వం - 4
❄ జీవించు, నడిపించు, వారసత్వాన్ని వదలివెళ్ళు - 9
❄ యోసేపు - 14
❄ విద్యార్థి నాయకత్వం ఎంతో విలువైనది - 19
❄ నను మలచిన సిలువ - 21
❄ జీవితాన్ని ఘనంగా ముగించడం - 22
❄ గొప్ప నాయకులు తప్పులెందుకు చేస్తారు? - 25
❄ క్రాస్ వర్డ్ పజిల్ - 28
❄ నిజ నాయకుడు- 29
❄ భూలోకాన్ని తలక్రిందులు చేసేవారు - 29
❄ కోశాధికారి లేఖ - 31
❄ A famous Indian Women Leader- 32



# ఆత్మీయ నాయకత్వం

ప్రపంచంలోనే అంగ, అర్థ, భారీ మిలటరీ సంపద కలిగిన దేశాల్లో రష్యా ఒకటి. ఇప్పుడు ఈ అగ్రరాజ్యం, చిన్నదేశమైన ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగింది. ఈ కఠోర పరిస్థితుల్లో ఉక్రెయిన్ దేశానికి సారథ్యం వహిస్తున్న 44 ఏళ్ళ యూదుడైన 'వొలొడిమిర్ జెలెన్‌స్కీ' ఒక కమెడియన్ నుంచి దేశ అధ్యక్షుడిగా ఎదిగాడు. చిత్తశుద్ధి, ధైర్యం, ప్రతికూల పరిస్థితుల్లో నిబ్బరం, దేవునిపట్ల గొప్ప విశ్వాసం ఉన్న నాయకుడిగా అనుక్షణం ఉక్రెయిన్ ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతూ, తానూ స్వయంగా యుద్ధంలో పాల్గొంటూ రష్యా సైన్యానికి కొరగాని కొయ్యగా ఉన్నాడు. ఉక్రెయిన్‌ను వదలి రక్షణకోసం తమ కుటుంబాన్ని యూరప్ దేశాలకు రమ్మని చెబితే 'నాకు మందుగుండు సామాగ్రి కావాలి... తప్పించుకునే మార్గం కాదు" అని చెప్పి నిజమైన నాయకుడు ఎలా ఉంటాడో ప్రపంచానికి చూపించాడు. "ఉక్రెయిన్ లొంగిపోతుందని ఎవరైనా భావిస్తే అది పొరపాటే అవుతుందని, అలాంటి వారికి ఉక్రెయిన్ గురించి ఏమీ తెలియదని, తానెక్కడికీ పారిపోలేదు, ఇక్కడే ఉన్నానని, తనపై మూడుసార్లు హత్యాయత్నం జరిగినట్లు" చెప్పి తన ప్రజల్లో ధైర్యాన్ని నూరిపోస్తున్నాడు. 2022 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇది చివరికి ఎలా మలుపు తిరుగుతుందో చూడాలి!

లోకంలోని నాయకత్వం ప్రజలలోనుండి వచ్చి వారి ఆశలు నెరవేర్చడానికి నాయకులుగా ముందుకు వస్తారు. వీరు దూరదృష్టి, మాటల్లో, కార్యాల్లో నేర్పరితనం, ఒక గమ్యంవైపు ప్రజలను నడిపించగలిగే సామర్థ్యం, నిస్స్వార్థం, నిరాడంబరత్వం, యథార్థత కలిగినవారుగా ఉంటారు. మన దేశంలో మహాత్మాగాంధీ, డా. బి.ఆర్. అంబేద్కర్‌లను ఉదహరించవచ్చు. అలాగే ప్రపంచంలో జార్జి వాషింగ్టన్, లెనిన్, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా, మావో మొదలగువారు. వీరు తమ ప్రజల అభివృద్ధి, సుఖం కొరకు వారి కి తెలిసినరీతిలో పాటుపడ్డారు. ప్రజల ఆశలను నెరవేర్చడం కోసమే ఈ నాయకత్వాలు నిలిచాయి. ఇక్కడ ఆ నాయకుని సామర్థ్యం, నాయకత్వ పటిమ చాలా ముఖ్యం.

## ఆత్మీయ నాయకత్వం

బైబిల్‌లో నాయకులుగా ప్రభువు వాడుకొన్న వారెవ్వరూ వారికై వారు వారి సామర్థ్యాన్ని బట్టి ముందుకు వచ్చినవారు కారు. ఇక్కడే, లోకంలోని నాయకత్వానికి, బైబిల్‌లోని ఆత్మీయ నాయకత్వానికి

తేడా కనబడుతుంది. బైబిల్‌లోని నాయకత్వం "మంటి ఘటాలలో మహిమైశ్వర్యము"గా వర్ణించవచ్చు. బలహీన ఘటాలను బలమైన కార్యాలు చేయడానికి దేవుడు ఎన్నుకొన్నాడు. అందువల్లనే అపొస్తలుడైన పౌలు "నేను ఎప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను" (2 కొరింథీ 12:10) అన్నాడు. "నా కృప నీకు చాలును, నీ బలహీనతయందు నా శక్తి సంపూర్ణమగుచున్నది" అన్నది ఆత్మీయ నాయకత్వపు ప్రాముఖ్యమైన లక్షణంగా కనబడుతుంది. పాతనిబంధనలో అబ్రహాము, మోషే, యెహోషువ, దావీదు, నెహెమ్యాలను ఉదాహరణలు గా చెప్పవచ్చును. కొత్తనిబంధనలో పౌలు, పేతురు, యోహానులను ఉదాహరణలుగా పేర్కొనవచ్చును. వీరు విభిన్న పనులకు, విభిన్న కాలాలలో దేవుని చేతిలో వాడబడిన ఆత్మీయ నాయకులుగా చెప్పవచ్చు.

## ఆత్మీయ నాయకుడంటే?

"దేవుని పని కొరకు దేవుని పిలుపు, దర్శనం కలిగిన వ్యక్తిగా ఉండి, ఆ పిలుపుకు, దర్శనానికి విధేయత చూపి, ఈ లోకంలో ఆ ప్రకారం నడుచుకొనే వ్యక్తిని ఆత్మీయ నాయకుడు" అనవచ్చు (అ.కా. 26:19-23).

## ఆత్మీయ నాయకునికి ఉండాల్సిన ఆరు లక్షణాలు

పైన పేర్కొన్న నాయకుల జీవితాలను పరిశీలించి ఒక నాయకునికి ఉండాల్సిన లక్షణాలను క్రోడీకరిస్తే వాటిల్లో ఆరు లక్షణాలను ప్రాముఖ్యంగా ఎంపికచేయవచ్చు. అవి..

### 1. ప్రభువు దర్శనం కలిగి ఉండాలి

పౌలు యొక్క క్రైస్తవ జీవితం, దేవుని దర్శనంతో ప్రారంభించబడింది. అతని మారుమనస్సు, పరిశుద్ధాత్మ నింపుదల, సేవా పిలుపు ఒకేసారి జరిగినట్లు చూస్తాం. పౌలు ప్రకటించిన సువార్త ప్రభువు ప్రత్యక్షత వలన కలిగినది. "నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియజెప్పుచున్నాను, మనుష్యుని వలన దానిని నేను పొందలేదు. నాకెవడును దాని బోధింపలేదు గాని యేసుక్రీస్తు బయలుపరచుట వలననే అది నాకు లభించెను" అని అన్నాడు (గలతీ 1:11,12).

నాయకత్వంలో, సువార్త పరిచర్యలో ఉన్నవారు స్టాఫ్ అయినా, గ్రాడ్యుయేట్ అయినా, పాస్టర్ అయినా, దేవుని పిలుపు, ప్రత్యక్షత కలిగి ఉండటం ఎంతో అవశ్యకం! దేవుడు నన్ను పంపాడు, దేవుడు

**ప్రార్థన లేని నాయకుడు, ఆ సంస్థకు, సంఘానికి పట్టిన చీడ. రోజుకి కనీసం గంట అయినా ప్రార్థించలేనివారు క్రైస్తవ నాయకత్వానికి పనికిరారు. ఎందుకంటే, ఆత్మీయ నాయకత్వం దేవుని సన్నిధిలో నుండి వచ్చేది. క్రైస్తవ నాయకుని ప్రోగ్రామ్ షీట్స్ ఒంటరి ప్రార్థన, ఉపవాస ప్రార్థన, సంఘ ప్రార్థన, సామూహిక ప్రార్థనలతో నిండాలి. ప్రార్థన లేని సేవ వర్షం లేని చేనులాంటిది.**

నాకు ఈ బోధ, బాధ్యత అప్పగించాడనే సాక్ష్యం ఎంతో శక్తివంతమైనది. దేవుని పరిచర్యలో వాలంటీర్స్ లేరు. అందరూ ఆ పని కొరకు పిలువబడినవారై ఉండాలి. బైబిల్ స్టడీ తీసుకోవడం అయినా, పెద్ద పెద్ద కాన్ఫరెన్స్‌లలో మాట్లాడడం అయినా, పరిచర్య చేసే విషయంలోనైనా అది దేవుడు మనకు ఇచ్చిన పిలుపుగా, పనిగా ఉంటేనే మనం అక్కడ ఆశీర్వాదకరంగా ఉండగలం.

"సువార్తను ప్రకటింపవలసిన భారం నా మీద మోపబడియున్నది" అన్నాడు పౌలు (1 కొరింథీ 9:16). ఈ భారంతో, ఆ గురిలో, వెనుకున్నవి మరచి ముందున్న వాటి కొరకు వేగిరపడుచూ గురియొద్దకే పరుగెత్తాడు. ఆ గురిలో పానార్పణంగా పోయబడే వరకు అలసిపోలేదు (2 తిమోతి 4:6). ఎందుకంటే అది దేవుడిచ్చిన పిలుపు, దర్శనం.

### 2. దేవునితో సహవాసం

#### ఎ. వాక్యం – ఆత్మీయ నాయకుని మార్గం

"నీ వాక్యం నా పాదములకు దీపం, నా త్రోవకు వెలుగు" అని అన్నాడు కీర్తనాకారుడు. యెహోషువ 1:7,8 వచనాలలో దేవుడు యెహోషువాతో "అయితే నీవు నిబ్బరము గలిగి జాగ్రత్తపడి, బహుధైర్యముగా నుండి, నా సేవకుడైన మోషే నీకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమంతటి చొప్పున చేయవలెను. నీవు నడచు ప్రతి మార్గమున చక్కగా ప్రవర్తించునట్లు నీవు దాని నుండి కుడికి గాని ఎడమకు గాని తొలగకూడదు. ఈ ధర్మశాస్త్ర గ్రంథమును నీవు బోధింప తప్పిపోకూడదు. దానిలో రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దానిని ధ్యానించిన యెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు.

ఆత్మీయ నాయకునిగా మనం ప్రజలను నడిపించాలంటే మనం వాక్యాన్ని బాగా చదివి, ధ్యానించి, అనుసరించేవారిగా ఉండాలి. వాక్యంతో సహవాసం, దేవునితో సహవాసమే. ఎందుకంటే వాక్యమే దేవుడైయున్నాడు. వాక్యాన్ని వెంబడించడమంటే దేవునిని వెంబడించడమే. ప్రభువు శిష్యులతో 'నన్ను వెంబడించండి' అన్నాడు. అంటే, వాక్యాన్ని వెంబడించడమే. దీనిని ప్రతి నాయకుడూ అలవర్చుకోవాలి. కొన్నిసార్లు వాక్యం మనకు అర్థం కాదు, మన గ్రహింపుని దాటి ఆత్మసంబంధముగా ఉంటుంది. అందుకని వాక్యానికి లోబడడం కష్టం అనిపిస్తుంది. ఒక దైవదాసుడు చెప్పినట్లు 'దో ఐ కాన్ట్ ట్రేస్ హిమ్, ఐ కెన్ ట్రస్ట్ హిమ్' అని మనం చెప్పగలగాలి. అబ్రహాము విశ్వాసం అదే. దేవుని చేతిలో బలంగా వాడబడిన దైవజనులందరూ, బైబిల్‌ని అనుసరించినవారే. బైబిల్‌ని వదిలేస్తే, మనం చుక్కాని లేని నావలాంటి వారమై ఎటువెళ్తామో మనకు తెలియదు.

పౌలు, తిమోతికి రాస్తూ "శక్తిగల పరిశుద్ధ లేఖనములయందు నిలకడగా ఉండుము" (2 తిమోతి 3:14-15) అని అన్నాడు. మన నాయకత్వాలకు ఇది ఎంతో అవసరం.

## బి. ప్రార్థన - ఆత్మీయ నాయకుని శ్వాస

క్రైస్తవ నాయకుడు, ప్రార్థనా అనుభవం కలిగి ఉండాలి. మన ప్రభువు ఈ భూమి మీద ఉన్న రోజులలో, "మహారోదనముతోను కన్నీళ్ళతోను... ప్రార్థనలను యాచనలను సమర్పించి... అంగీకరింపబడెను" (హెబ్రీ 5:7). వారు విసుగక నిత్యము ప్రార్థించవలెనని ఆయన ఈ ఉపమానము చెప్పెను అని లూకా 18వ అధ్యాయంలో చదువుతాము. ప్రార్థన మనలను దేవునితో కలుపుతుంది. ప్రార్థన మనము చేయవలసిన పనులకు దేవుని సహాయాన్ని అందిస్తుంది. బైబిల్లోని నాయకులందరూ ప్రార్థించినవారే. మోకాళ్ళపై వారు ప్రపంచాన్ని జయించారు. మొదటి సం॥లలో ప్రభువును సిలువ వేసి చంపి, క్రైస్తవుల్ని హింసించిన రోమా ప్రభుత్వపు చక్రవర్తే క్రీ.శ.312 కల్లా ప్రభువు నామమున మోకరించాడంటే కారణం ఆనాటి సంఘాల ప్రార్థనలే. పౌలు, సీలలను బాగా దెబ్బలు కొట్టి జైలులో బంధించినప్పుడు, వారు చేసిన ప్రార్థన జైలు గోడలను బద్దలు చేసింది. నెహెమ్యా ప్రార్థన యెరూషలేము గోడలు కట్టడానికి కారణమైనది. ఎజ్రా ప్రార్థన పడిపోయిన దేవాలయాన్ని తిరిగి నిర్మించడానికి కారణమైంది. జాన్ నాక్స్ స్కాట్‌లాండ్ దేశము కొరకు ప్రార్థించాడు. మన దేశము కూడా అనేకమంది ప్రార్థనాపరులైన పరిశుద్ధులను చూసింది. పాపికి రక్షణ, సాతాను కోటలు కూల్చబడటం, క్రైస్తవ సాక్ష్యం, క్రీస్తు రాజ్య వ్యాప్తి ప్రార్థనతోనే సాధ్యం. ప్రార్థన లేని నాయకుడు, ఆ సంస్థకు, సంఘానికి పట్టిన చీడ. ప్రభువు శిష్యులతో మీరు నాతో ఒక్క ఘడియయైనా ప్రార్థనలో ఉండలేరా అని అడిగారు. రోజుకి కనీసం గంట అయినా ప్రార్థించలేనివారు క్రైస్తవ నాయకత్వానికి పనికిరారు. ఎందుకంటే, ఆత్మీయ నాయకత్వం దేవుని సన్నిధిలో నుండి వచ్చేది. ఒక క్రైస్తవ నాయకుని ప్రోగ్రామ్ షీట్స్ ఒంటరి ప్రార్థన, ఉపవాస ప్రార్థన, సంఘ ప్రార్థన, సామూహిక ప్రార్థనలతో నిండాలి. ప్రార్థన లేని సేవ వర్షం లేని చేనులాంటిది గనుక జాగ్రత్తపడదాం.

## 3. పరిశుద్ధత

'నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి' అని దేవుడు సెలవిచ్చాడు. పరిశుద్ధత లేకుండా మనం దేవునిని సమీపించలేము. మన మాటలు, ప్రవర్తన, ఆలోచనల్లో ఎంత పరిశుద్ధతను పాటిస్తున్నామో గమనించుకోవాలి. దేవుని చేతిలో వాడబడే నాయకుడు, యోసేపును పోలి పాపము నుండి పారిపోవాల్సిందే. ఈ రోజుల్లో సంఘాలు, సంస్థలు లోకంతో, పాపంతో రాజీపడడం మామూలు అయిపోయింది. అందుకని సంస్థగా, సంఘంగా మనం ఉన్నాగానీ దేవుడు కోరిన ప్రమాణాల్లో మనం నిలవడం లేదు. దానియేలు, షద్రక్, మేషక్, అబేద్నగోలతో పోల్చితే మన స్థితి ఎక్కడ? వారి ద్వారా దేవుని కొరకు రాజ్యాలు జయించబడ్డాయి. వారు కేవలం తమ్మును తాము అపవిత్రపరచుకోరాదని నిర్ణయించుకొన్నారు. మన మాటలు అవునంటే అవును, కాదంటే కాదు అన్నట్లుగా ఉన్నాయా? ఇంతకుమించినవి అపవాది మాటలని ప్రభువు సెలవిచ్చారు.

క్రైస్తవ నాయకత్వంలో మాట మార్చేవారు, అబద్ధాలు చెప్పేవారు, వ్యభిచార సంబంధమైన పాపాలతో రాజీపడేవారు ఎక్కువయ్యారు. స్వలింగ సంపర్కం, రకరకాల లైంగిక పాపములు ఆత్మీయ సంఘాలు, సంస్థలనుకొనే వాటిలో కూడా కనబడుచున్నాయి. కొరింథీ సంఘానికి దైవజనుడైన పౌలు రాస్తూ

పాతనిబంధనను ఉదహరించారు (2 కొరింథీ 6:16-18). నేను మీ మధ్య నడిచెదను. మీకు దేవుడనైయుందును. మీరు నాకు కుమారులు, కుమార్తెలునైయుందురు అని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు. ఇది మనకు దిక్సూచిగా పనిచేయును గాక.

### 4. సాత్వికము, సేవకత్వము

ప్రభువు – “నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను గనుక మీరు నాయొద్ద నేర్చుకొనుడి (మత్తయి 11:29) అన్నారు. నేను సేవ చేయించుకొనుటకు రాలేదు గానీ సేవ చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా ప్రాణమునిచ్చుటకు వచ్చెనని” చెప్పెను (మత్తయి 20:28). గనుక ఆయన నాయకత్వపు లక్షణాలు కలిగిన పౌలు “మేము మమ్మును గూర్చి ప్రకటించుకొనుటకు రాలేదు గానీ, క్రీస్తు యేసును గూర్చి ఆయన ప్రభువనియు, మమ్మును గూర్చి యేసు నిమిత్తము మేము మీ పరిచారకుల మనియు ప్రకటించుచున్నాము” (2 కొరింథీ 4:6). “ఏవిధముచేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరి కి అన్నివిధముల వాడనైయున్నాను (1 కొరింథీ 9:22) అన్నాడు. కాబట్టి క్రైస్తవ నాయకత్వములో తగ్గింపు అనేది అత్యంత ప్రాముఖ్యమైన లక్షణం. ఎవరికి సువార్త ప్రకటిస్తున్నామో, ఎవరిని నడిపిస్తున్నామో వారికి మనం సేవకులమన్న అభిప్రాయం కలిగి ఉండడం క్రీస్తు మనస్సు కలిగి ఉండటమే (ఫిలిప్పీ 2:5). ప్రభువునుండి స్ఫూర్తిని పొందిన ఆంగ్లేయులు వారి ప్రధానమంత్రిని ‘ప్రైమ్ మినిస్టర్’ అని అనడం ప్రారంభించారు. అధికారము ప్రజలకు సేవ చేయడానికే గాని, అందలమెక్కి అందరిచేత గొప్ప అని అనిపించుకోవడానికి కాదు అనే గొప్ప విషయాన్ని మనం నేర్చుకొన్నామా?

### 5. విశ్వాసపు నడక

ఆత్మీయ నాయకుడు వాక్యం ఏమి చెబుతుందో దానియందు విశ్వసించి దానిలో నడుచుకొంటాడు. మన ఫీలింగ్స్, మన అనుభవం కంటే దేవుని వాక్యం, వాగ్దానం ఏమి చెబుతుందో దానిని నమ్మి ఆ దిశలో ముందుకు నడవాలి. అబ్రహాము దేవుని నమ్మెను అనే మాటలో – అతను తన పరిస్థితిని, శారా పరిస్థితిని చూడలేదు అనే అర్థము వస్తుంది. మృతులను సజీవులు గా చేయువాడును, లేనివాటిని ఉన్నట్లే పిలుచువాడునైన దేవునివైపే చూచి, దేవుని మహిమపరిచాడు (రోమా



4:17-21). అలాగే సంఖ్యాకాండము 13,14 అధ్యాయాలలో కాలేబు, యెహోషువాలు కనానీయుల వైపు, తమవైపు చూచుకొని చెడ్డ సమాచారము ఇచ్చిన ఆ 10 మందిని వెంబడించక, దేవునివైపు చూచి, “మనకు శక్తి చాలును మనం వెంటనే వెళ్ళదాం, యెహోవా మనయందు ఆనందించిన యెడల అందులో ప్రవేశపెడతాడు” అన్నారు.

దావీదు, గొల్యాతును దేవుని ద్వారా చూశాడు కాబట్టి జయించగలిగాడు. ఇది క్రైస్తవ నాయకునికి ఉండాల్సిన ముఖ్యమైన లక్షణం. అందుకనే జార్జిముల్లర్, హడ్సన్ టేలర్ విశ్వాసవీరులుగా ఎంచబడ్డారు. విలియం కేరీ అయితే, “దేవుని కొరకు గొప్ప కార్యాలు ఆశించు, దేవునికి కొరకు గొప్ప కార్యాలు చేయి” అన్నాడు. విశ్వాసం – దేవుడు మనతో ఉన్నాడని, దేవుని మాటలన్నీ సత్యమే అని, మనము వెళ్ళి స్వాధీనం చేసుకొందాం అంటుంది. విశ్వసించువాడు కల వరపడడు. హెబ్రీ 11వ అధ్యాయంలో విశ్వాసవీరుల పట్టిక ఉంది. మన పేరు కూడా అటువంటి పట్టికలోనికి రావాలి అంటే, మనం కూడా విశ్వాసం ద్వారా చేసిన కార్యాలు ఉండాలి.

### 6. పరిశుద్ధాత్మ నింపుదల, నడిపింపు

క్రైస్తవ నాయకునికి ఉండవలసిన మరొక ప్రాముఖ్యమైన లక్షణం పరిశుద్ధాత్మ పూర్ణతగల జీవితం. అపోస్తలుల కార్యాల గ్రంథం నిజానికి పరి శుద్ధాత్మ కార్యాల గ్రంథం. అపోస్తలులు ఆ గ్రంథంలో ఏమి చేశారో, ఎలా జీవించారో అవన్నీ పరిశుద్ధాత్మ నింపుదల, నడిపింపుతో జరిగినవే. అపొ.కా. 2వ అధ్యాయం లేకపోతే మిగిలిన అధ్యాయాలు ఉండవు. ఆత్మపూర్ణులై ఉండుడి (ఎఫెసీ 5:18) అని పౌలు మనకు హెచ్చరిక చేశాడు. గలతీ పత్రికలో ఆత్మఫలం గూర్చి మాట్లాడాడు. 1 కొరింథీ 12వ అధ్యాయంలో ఆత్మ వరాల గూర్చి మాట్లాడాడు. రోమా 5వ అధ్యాయంలో పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయంలో కుమ్మరించబడింది అంటున్నాడు.

ప్రభువు శిష్యులతో నేను వెళ్ళి మీ యొద్ద ఎల్లప్పుడూ ఉండుటకై ఆదరణకర్తను పంపిస్తాను అన్నాడు. ఆయన మీతో ఉండును, మీలో ఉండును, మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును అని చెప్పాడు. ప్రభువు – నా గొఱ్ఱెలు నా స్వరము వినును, అవి నన్ను వెంబడించును అని చెప్పారు. ఆయన స్వరం వినడం దేవుడు మనకు ఇచ్చిన ఆధిక్యత. ఈ ఆధిక్యతను ఎంతోమంది కోల్పోతున్నారు. ఆత్మను ఆర్పవద్దు, పరిశుద్ధాత్మను దు:ఖపరచకుడని పౌలు పత్రికలలో రాశాడు. మనం పాపం చేసినప్పుడు, పరిశుద్ధాత్ముడు దు:ఖపడతాడు. చాలామంది విశ్వాసులకు ఆయన తమ హృదయంలో ఉన్నట్లు కూడా తెలియడంలేదు.

పరిశుద్ధాత్మునితో కలసి నడిస్తే,
పెద్ద సైన్యంతో నడిచినట్టే
పెద్ద సప్లై లైన్ కలిగి ఉన్నట్లే
అన్ని ఆత్మీయ ఆశీర్వాదాలు కలిగి ఉన్నట్లే
జ్ఞానమంతా మనతో ఉన్నట్లే

కాబట్టి దేవుని నాయకుడు పరిశుద్ధాత్మ సహవాసాన్ని కలిగి జీవించడం ఆవశ్యకం. ఆయన లేకపోతే చీకటి ఇంటిలో వస్తువులు వెదకినట్లే.

పై లక్షణాలు గల నాయకులు ఉన్న సంఘాలు, సంస్థలు దేవుడు ఉద్దేశించిన గమ్యంలో నడుస్తాయి. ఒకవేళ నాయకత్వములో పై లక్షణాలు లోపించినా, కొదువయినా అవి దేవుని మనసును ప్రతిఫలింపచేయవు.

## ప్రస్తుత సంఘాల్లో, సంస్థల్లో పరిస్థితులు

ఈ రోజులలో సంఘాలలో, సంస్థలలో ఉన్న వాక్య వ్యతిరేక ధోరణులు చూసినప్పుడు ఒక సామాన్య విశ్వాసి కలవరపడక మానడు. సంఘాలలో, సంస్థలలో చేయబడే విభిన్న బోధల వెనుక ఉన్నది ఎవరు? సాతానే. లోకంలో ఉన్న విభిన్న పోకడల వెనుక అపవాది, వాని దూతలు ఉన్నారని ఎఫెసీ 2:2,3 వచనాలలో చదువుతాము. ప్రభువు రాకడ సమీపించేకొలది సాతాను కుయుక్తి, తాకిడి మరి యెక్కువగా చూస్తున్నాం. సంఘాలలో తప్పుడు బోధలు, లోక విధానాలు, ఆచారాలు, అలవాట్లు, వేషధారణ, భేధములు, గర్వము, అతిశయము, అసూయలు, లైంగిక పాపములు, అబద్ధాలు ఎక్కువై అవి సంఘాలను, సంస్థలను పాడుచేస్తున్నాయి.

## జయించేవారు కావాలి

కొరింథీ సంఘములో ఈ లక్షణాలు బయటపడ్డాయి. అయితే అపొస్తలుడైన పౌలు ఎంతో చక్కగా, సూక్ష్మంగా వాటిని ఖండించి, సరిచేశారు. అలాంటి ఆత్మీయ నాయకత్వము ఈ రోజుల్లో మనకూ అవసరం. ప్రకటన గ్రంథంలోని 7 సంఘాలలో కూడా ప్రభువు అనేక లోపాలను, తప్పులను ఎత్తిచూపారు. అయితే అదే సమయంలో ఆ సంఘాలలోని జయించేవారిని ప్రత్యేకంగా నిలిపారు. అలాగే ప్రతి సంఘంలో, సంస్థలో జయించేవారు ఉంటారు. జయించేవారి ద్వారా సంఘాన్ని పరిపూర్ణతలోనికి నడిపించడానికి దేవుడు ఇష్టపడుతున్నారు. ఈ జయించేవారు తమ్మునుతాము దేవుని కొరకు అప్పగించుకొని, దేవుని చిత్తాన్ని నెరవేర్చగోరేవారుగా ఉంటారు. అలాంటి వారి కోసం దేవుని కన్నులు వెదుకుతున్నాయి.

పాతనిబంధనలో ఎజ్రా, నెహెమ్యాలు అలాంటి నాయకులుగా కనబడుతున్నారు. యెరూషలేములో దేవుని మందిరము, పట్టణ ప్రాకారపు తలుపులు కాల్చబడి కూల్చబడ్డాయి. ఇవి ఇశ్రాయేలీయుల ఆత్మీయ, మానసిక, శారీరక, సామాజిక పతనస్థితిని తెలియజేస్తున్నాయి. ఎజ్రా, నెహెమ్యా ద్వారా దేవుడు దిద్దుబాటు పనులు చేయించారు. తిరిగి మొదట ఉండిన విలువలు, కట్టుబాట్లు, ధర్మశాస్త్రము, విశ్వాసం, ఆరాధన, దేవుని కొరకైన ప్రత్యేకత, వారి జీవితాలలోనికి ప్రవేశించినవి. యెహోవాయందు ఆనందించుట వలన మీరు బలమొందుదురు (నెహెమ్యా 8:10). అనే మాట చూస్తాం.

నీవు దేవుని చేతిలో వాడబడే ఎజ్రా, నెహెమ్యా, అపొస్తలుడైన పౌలు, యోహానులాంటి వ్యక్తిగా ఉండగలవు. దేవుడు నీ ద్వారా సంఘమంతటిని మహిమగల సంఘంగా, సంస్థగా మార్చగలరు.

## ముగింపు

సంఘాల్లో, సంస్థల్లో దేవుని మహిమను తిరిగి తీసుకొనిరావడానికి దేవుడు ఉపయోగించుకొనే వ్యక్తిగా నీవు ఉండగలవా? బండసందుల్లో నిలబడే వ్యక్తులు దేవునికి కావాలి (యెహెజ్కేలు 22:30). సంఘాల్లో విలువలు, ప్రమాణాలు అట్టడగు స్థాయికి పడిపోతున్నప్పుడు, వాటిలో తిరిగి తన మహిమ తీసుకొనిరావడానికి దేవుడు జయించే వారి కోసం చూస్తున్నాడు. అలాంటి వ్యక్తులుగా మనము ఉండేటట్లు దేవుడు సహాయం చేయునుగాక!

– డా. టి. జోసఫ్, మచిలీపట్నం



# జీవించు, నడిపించు

## వారసత్వాన్ని వదలివెళ్ళు

యెహోషువ 1:1-9; 24:1-15

ఏదైనా ఒక చక్కని పుస్తకం రాయడానికి మొదలు పెట్టినప్పుడు ఆసక్తికరమైన లేదా హాస్యంతో కూడుకున్న ఒక సంఘటనతో మొదలుపెట్టడానికి ఇష్టపడతారు గానీ నెగిటివ్‌గా ప్రారంభించరు. కానీ యెహోషువ గ్రంథం మొట్టమొదటి అధ్యాయం మొట్టమొదటి వచనంలో దేవుని సేవకుడైన మోషే మృతి నొందిన తర్వాత అని వ్రాయబడివుంది. ఈ మాటల్ని నేను చదివినప్పుడు అక్కడ ఒక నిమిషం ఆగి ఆలోచించాలనుకున్నాను. తర్వాత వచనాల్ని చూడటానికి ముందు ఎటువంటి పరిస్థితుల్లో ఈ మాటలు చెప్పబడ్డాయో తెలుసుకోవలసివుంది. యెహోషువ ఇప్పటి వరకు ఎవరినైతే నాయకుడుగా మాదిరిగా కలిగి ఉన్నాడో, ఎవరిమాటలైతే వింటూ వచ్చాడో, ఎవరిమీదైతే ఆధారపడుతూ వచ్చాడో ఆయన చనిపోయాడు. ఆ నాయకుడు ఇప్పుడు లేడు, దేవునితో ఉండటానికి వెళ్ళిపోయాడు. ఒంటరితనం, భయం, నిరుత్సాహం కలిగాయి. తనముందున్న పని చాలా గొప్పది. ఇప్పుడు యెహోషువ ఆధారపడవలసినది కేవలం దేవుని మీద మాత్రమే.

ఏ వ్యక్తుల్ని అయితే మనం చూస్తూ ఎదిగామో, ఎవరినైతే మనకు మాదిరిగా ఉంచుకొన్నామో వారు ఒక్కోసారి పడిపోవడమో లేదా లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోవడమో జరిగినప్పుడు మనకు భయం, దిగులు, నిరుత్సాహం సంభవిస్తాయి. అలాంటి పరిస్థితుల్లో దేవుని కొరకు ఈ లోకంలో గొప్ప పనుల్ని చేయడానికి ధైర్యం తెచ్చుకొని ముందుకు వెళ్ళడమే మనముందున్న గొప్ప సవాలు.

క్షణక్షణానికి మార్పుచెందుతున్న ఈ లోకంలో, పరిస్థితుల్లో నేను ఎలా జీవించాలి? దేవుని బిడ్డల్ని ఏ విధంగా ముందుకు నడిపించాలి? నేను వెళ్ళిపోయేటప్పుడు ఎటువంటి వారసత్వాన్ని విడిచి వెళ్ళబోతున్నాను? అనే ప్రశ్నలు ఒక విశ్వాసి జీవితంలో చాలా ప్రాముఖ్యమైనవి.

నీవు దేవుని కొరకు జీవించాలంటే, దేవుని కొరకు అనేకమందిని నడిపించాలంటే, నీ తర్వాత కూడా దేవునికొరకు ఒక వారసత్వాన్ని విడిచివెళ్ళాలంటే ఈ అంశాలను జ్ఞాపకం చేసుకో.

### 1. దేవుని ఉద్దేశాలలో నుండి ధైర్యాన్ని, నమ్మకాన్ని పొందుకో

మోషే మరణం తర్వాత యెహోషువ ఎటువంటి దు:ఖం, వేదన గుండా వెళ్తున్నాడో దేవుడు గుర్తించాడు. మీరు కూడా ఎటువంటి పరిస్థితుల్లో వెళ్తున్నారో దేవుడు వాటిని అర్థం చేసుకొన్నాడని, అప్పుడు ఆయన మీతో ఉన్నాడని మీకు తెలుసా? దేవుడు యెహోషువాతో "యెహోషువా మోషే చనిపోతే నీవెందుకు దిగులు పడుతున్నావు? నేనున్నాను. నువ్వు దిగులు పడవద్దు" అని గద్దిస్తున్నట్లు చెప్పలేదు. దేవుడు యెహోషువాతో చాలా కృపాసహితంగా "యెహోషువా, నా సేవకుడైన మోషే చనిపోయాడు" అనే మాటల్లో దేవుని హృదయ స్పందన గమనించగలుగుతున్నాం. నీ దిగులును, దు:ఖాన్ని, వేదనను అర్థం చేసుకోగలను. నీ దు:ఖంలో, విచారంలో నేను కూడా పాలుపంచుకొంటున్నాను. నీ ఒంటరి

తనాన్ని నేనుకూడా అర్థం చేసుకొంటున్నాను. కానీ నా మాటలు విను. "కాబట్టి నీవు లేచి, నీవును ఈ జనులందరును ఈ యొర్దానునది దాటి నేను ఇశ్రాయేలీయులకిచ్చుచున్న దేశమునకు వెళ్ళుడి. నేను మోషేతో చెప్పినట్లు మీరు అడుగుపెట్టు ప్రతి స్థలమును మీకిచ్చుచున్నాను" అని చెప్పాడు.

మోషే చనిపోయాడని యెహోషువా దిగులు పడుతుంటే ఎప్పుడో మోషేతో చేసిన ప్రణాళికల గురించి దేవుడు మాట్లాడుతున్నాడు. మోషే యెహోషువాలు పుట్టడానికి ఎన్నో ఏళ్ళకుముందు అబ్రహాముతో 'నీవు అడుగుపెట్టిన ప్రతి స్థలాన్ని నీకు ఇస్తానని' వాగ్దానం చేసిన దాన్ని ఇప్పుడు దేవుడు యెహోషువాకు జ్ఞాపకం చేస్తున్నాడు. వ్యక్తులు, నాయకులు రావచ్చు పోవచ్చు కానీ దేవుని ప్రణాళికలు, ఉద్ధేశాలు అలానే ఉంటాయి, కొనసాగుతూ ఉంటాయి. అబ్రహాము, ఇస్సాకు, యాకోబులనే పితరులకు దేవుడిచ్చిన వాగ్దానాలు మరలా గింగురమంటూ మోగుతున్నాయి.

మెథడిస్ట్ సంఘాన్ని స్థాపించిన జాన్‌వెస్లీ సమాధి మీద ఈ మాటలు రాయబడ్డాయి "దేవుడు తన బిడ్డలను పాతిపెడతాడు గానీ ఆయన పనిమాత్రం కొనసాగుతూనే ఉంటుంది". దేవుని పనివారు వస్తుంటారు పోతుంటారు. దేవుని పనిమాత్రం జరుగుతూనే ఉంటుంది. వెస్లీలాంటి గొప్ప దైవజనులు రావచ్చు పోవచ్చు కానీ వెస్లీ ద్వారా దేవుడు జరిగించిన పనిమాత్రం కొనసాగుతూనే ఉంటుంది. దేవుడు మోషేని పాతిపెట్టాడు. యెహోషువా ద్వారా పని కొనసాగుతూనే ఉంటుంది.

దేవుని ఉద్దేశాలు, ప్రణాళికలు ఒకచోట ఆగిపోయేవికాదు, అవి కొనసాగుతూనే ఉంటాయి. దేవుని కొరకు నీవు జీవించాలనుకొంటే, దేవుని కొరకు ప్రజలను నడిపించాలనుకొంటే, దేవుని కొరకు ఒక వారసత్వాన్ని నీవు విడిచివెళ్ళాలనుకుంటే దేవుని యొక్క ఉద్దేశాలలోనుండి నీ **ధైర్యాన్ని, నమ్మకాన్ని** పొందుకో.

భూమికి పునాదులు వేయకముందే నీవు ఏర్పాటు చేయబడి ప్రభువైన యేసుక్రీస్తు యొక్క ప్రశస్త రక్తంద్వారా విమోచించబడ్డావు. విమోచన దినం వరకు పరిశుద్ధాత్ముని చేత ముద్రించబడ్డావు. ఎఫెసీ 1వ అధ్యాయం ప్రకారం ఇవన్నీ ఆయన నామ మహిమ కొరకు మాత్రమే జరిగాయి. సువార్త మనచేతికి అప్పగించబడింది. సువార్తను ప్రకటించడానికి మనం ఋణస్తులమైయున్నాం. ఇవన్నీ దేవుని అద్భుతమైన ప్రణాళికలు కాదా! వీటిల్లో **నమ్మకాన్ని** పొందు.

## 2. దేవుని మాటల నుంచి ధైర్యాన్ని తెచ్చుకో

దేవుని మాటలు మన మేలు, క్షేమం నిమిత్తం, మన త్రోవకు వెలుగుగా ఉండడానికి రాయబడ్డాయి. యౌవనస్తులారా దేవుని వాక్యాన్ని ప్రేమించండి, చదవండి, ధ్యానించండి, కంఠస్తం చేయండి. బలహీనులమైన మనకు దేవుడిచ్చే సంపద ఇది. నీ పనుల్లో సతమతమైపోయి ఉండకు. కొంత సమయాన్ని తీసుకుని దేవుని వాక్యాన్ని ధ్యానించు. దేవుని వాక్యం నీకు నొప్పి కలిగించకపోతే ఈ లోకం నిన్ను మింగేస్తుంది. దేవుని వాక్య సవాళ్ళకు నిన్ను నీవు బయలుపరచుకో. దేవుని వాక్య హెచ్చరికల చేత నొప్పికలగడానికి ఇష్టపడాలి. చిరునవ్వుతో ఆహ్వానించాలి. దేవుని వాక్యం చేత నీవు నడిపించబడకపోతే లోకం నిన్ను పక్కదారి పట్టిస్తుంది. మీ బైబిల్స్ మూసి ఉన్నాయన్న సంగతి సాతానుకు తెలిస్తే మిమ్ముల్ని మింగేయడానికి సాతానుడు తన నోరు తెరుస్తాడు.

యెహోషువ 1:7,8 వచనాలు చదవుదాం. "అయితే నీవు నిబ్బరము కలిగి జాగ్రత్తపడి బహు ధైర్యముగానుండి, నా సేవకుడైన మోషే నీకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమంతటి చొప్పున చేయవలెను. నీవు నడుచు ప్రతి మార్గమున చక్కగా ప్రవర్తించునట్లు నీవు దానినుండి కుడికి గాని ఎడమకు గాని తొలగకూడదు. ఈ ధర్మశాస్త్ర గ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించినయెడల నీ మార్గమును వర్థిల్లచేసుకొని చక్కగా ప్రవర్తించెదవు".

దేవుని వాక్యాన్నుంచి నీవు అభయాన్ని పొందు. అప్పుడు మాత్రమే నీవు దేవుని కొరకు జీవించగలవు, దేవుని కొరకు అనేకమందిని నడిపించగలవు, నీ తర్వాత కూడా ఒక వారసత్వాన్ని వదిలివెళ్ళగలవు. దేవుని నుండి, ఆయనమాటల నుండి మాత్రమే ఇవన్నీ ప్రవహిస్తాయి.

## 3. దేవుని సన్నిధి నుండి ధైర్యాన్ని తెచ్చుకో

యెహోషువ 1:9 వచనం చదువుదాం. "నేను నీకు

ఆజ్ఞ ఇచ్చియున్నాను గదా, నిబ్బరము కలిగి ధైర్యముగా నుండుము, దిగులుపడకుము జడియకుము. నీవు నడచుమార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును".

దేవుని కొరకు జీవించాలంటే, దేవుని కొరకు అనేకమందిని నడిపించాలంటే, నీ తర్వాత కూడా దేవుని కొరకు ఒక వారసత్వాన్ని వదిలివెళ్ళాలంటే దేవుని సన్నిధినుండి ధైర్యాన్ని పొందు. నీకు కావల సినదాంట్లో అతి ప్రాముఖ్యమైన విషయం ఏంటంటే దేవుడు నీకు తోడుగా ఉన్నాడు. అదే శ్రేష్టమైనది.

ఆదికాండం 39వ అధ్యాయంలో దీనికి చక్కని ఉదాహరణ ఉంది. ఈ అధ్యాయం మొదటి మాట, చివరి మాట ఒకేలా ఉంటాయి. "యెహోవా యోసేపునకు తోడైయుండెను అని రాయబడింది". కాబట్టి అతడు చేసింది అంతా కూడా వర్ధిల్లింది. పోతీఫరు గృహాన్ని బట్టి, భోజనాన్ని బట్టి అతడు చేసిందంతా సఫలం అవడం కాదు. చివరి వచనాల్లో చూస్తే యోసేపు పోతీఫరు గృహంలో లేడు. ప్యాలెస్ నుండి ప్రిజన్‌కు వచ్చాడు. చాలా గొప్పమార్పు. అక్కడ కూడా "అతడు చేయునది యావత్తు యెహోవా సఫల ము చేసెను" అనే మాట చూస్తాము.

నీవు ఎలాంటి పరిస్థితిలో ఉన్నప్పటికీ దేవుడు నీకు తోడుగా ఉన్నాడా? లేదా అన్నదే ముఖ్యం. మోషే మృతినొందాడు. దేవుడు మాత్రం యెహోషువాతో ఉన్నాడు. ఆయన తోడుతో, సన్నిధితో తర్వాతి అడుగు ముందుకు వేయవచ్చు. మోషేను కలిగి ఉండి, దేవుడు లేనట్లయితే యెహోషువా ఎందుకూ పనికిరాడు. మోషే లేకపోయినప్పటికీ దేవుడు తనకు తోడుగా ఉంటే అన్నీ ఆయనతో ఉన్నట్లే. దేవుని వాక్యం చెబుతుంది యెహోషువా నేను నీతో ఉన్నాను అని. దానిలోనే వ్యత్యాసం అంతా ఉంది.

కళాశాల ప్రాంగణంలో నీవు నడుస్తున్నప్పుడు, ఒక బైబిల్ స్టడీ తీసుకొంటున్నప్పుడు, నీ స్నేహితులతో దేవుని సువార్తను చెబుతున్నప్పుడు దేవుడు నీకు తోడుగా ఉన్నాడు. దేవుడు నీకు తోడుగా ఉంటే సమస్తం నీకు ఉన్నట్లే. నీవు వెయ్యి పుస్తకాలు చదివి ఉండవచ్చు, వెయ్యిమంది భక్తులు రాసిన కోట్స్ అన్నీ తెలిసి ఉండవచ్చు, నీ సబ్జెక్ట్‌లో నీవు ప్రజ్ఞావంతుడవై ఉండవచ్చు, ఎంతో గొప్ప సేవకుడవై ఉండవచ్చు కానీ దేవుడు నీకు తోడుగా లేకపోతే అవన్నీ వ్యర్థమే.

## 4. దేవుని ప్రజలను ఆయన ప్రాధాన్యతల్లో ఉంచడానికి ప్రయత్నం చేయి

యెహోషువా 24వ అధ్యాయంలో గొప్ప పని సంపూర్తి చేయబడింది. దేవుడిచ్చిన వాగ్దాన దేశంలోకి నడిపించిన ఈ సఫలీకృతుడైన, విజయవంతమైన నాయకుడు యెహోషువ. కనానులో ఉన్న గొప్ప గొప్ప బలాఢ్యులైన సైనికులందరిని ఓడించాడు. ఆ రాజ్యాన్ని అంతటిని ఓడించి స్వాధీనపరచుకొని ఇశ్రాయేలీయుల గోత్రాలన్నిటికి విభాగించాడు. పని అయిపోయింది. పనంతా పూర్తిచేసినందుకు గాను ఒక స్టేజ్ మీదకు వెళ్ళి ఒక మెమెంటో ఇచ్చిఉంటే తీసుకోవాల్సినవాడు కానీ 24వ అధ్యాయంలో ఒక మలుపు తీసుకొంటున్నాడు. వృద్ధుడైపోయిన యెహోషువ సమాజాన్నంతటిని పిలిచి అడుగుతున్నాడు. మీరు ఎవరిని సేవిస్తారు? యెహోషువాను సేవిస్తారా? రేపు ఆయన కూడా వెళ్ళిపోతాడు. మోషే చనిపోయినట్లుగానే యెహోషువా కూడా చనిపోతాడు. నది అవతల ఉన్న దేవతలను సేవిస్తారా? ఈజిప్టు యొక్క దేవతలను సేవిస్తారా? మీరు ఎవరిని సేవిస్తారు? ఇప్పుడు ఒక ఎంపిక చేసుకోండి. నేను ఇప్పటికే ఎంచుకొన్నాను "నేనును నా యింటి వారును యెహోవానే సేవిస్తాము". వృద్ధుడైన యెహోషువకు బాగా తెలుసు తన జీవితంలో అత్యధికమైన ప్రాధాన్యత ఏంటంటే దేవున్ని సేవించడం. ఈ వాగ్దాన దేశానికి వచ్చిన జనాంగము, ఇప్పుడు చేయవలసిన పని కూడా ఆయనను సేవించడం, ఆయనకు మహిమ తీసుకురావడమే అని ఆయన చెబుతున్నాడు. అద్భుతమైన, విజయవంతమైన, వృద్ధుడైన ఒక నాయకుడు తన జీవిత చరమాంకంలో ప్రజలందరు దేవునిని సేవించడానికి సవాలు చేస్తున్నాడు.

ఇక్కడ కూర్చున్న యువకులు అనేకులు అద్భుతమైన తలాంతులు కలవారు ఉన్నారు. దేవుడు మిమ్మల్ని బహు బలంగా వాడుకోబోతున్నాడు. ఇప్పటికే మిమ్మల్ని వాడుకొంటూ ఉండవచ్చు. అయితే మీకు ఒక హెచ్చరిక. మీ శిష్యులను తయారు చేసుకోకండి. క్రైస్తవ పరిచర్యలో అభిమాన సంఘాలు ఉండవు. అటువంటి వాటిని మొదలు పెడుతున్నావంటే నీవొక విగ్రహాన్ని తయారు చేస్తున్నావు. యెహోషువా గ్రంథం చివరికి వెళ్తే అది యెహోషువా దేవునితోనే ముగుస్తుంది. యెహోషువ చెబుతున్నాడు, నన్ను

కాదు, నన్ను కాదు వెంబడించాల్సింది, చూడాల్సింది నా దేవుడైన యెహోవాను మాత్రమే. ప్రజలను అక్కడికి నడిపించాలి. దేవునికి భయపడమని చెప్పి నేర్పించాలి. నిన్ను చూసిన వారు నీ దేవునిని చూడగలిగేటట్లు ఉండాలి. నీవు నోరు విప్పినప్పుడు దేవుని యొక్క మాటలుగా అవి ఉండాలి. మహిమను గుర్తించి దేవునిని వెంబడించాలని వారు ప్రోత్సాహించబడాలి.

చీకటి ఖండమైన ఆఫ్రికాకు డేవిడ్‌లివింగ్‌స్టన్ అనే మిషనరీ వెళ్ళాడు. ఆయన ఒక మెడికల్ డాక్టర్. దేవుడు ఆయనను మెడికల్ మిషనరీగా ఆఫ్రికా వెళ్ళి పనిచేయమన్నాడు. ఆఫ్రికాలో అనేక సంవత్సరాలు పనిచేసి చనిపోయిన తర్వాత ఆ దేహాన్ని స్వంత పట్టణానికి తీసుకువచ్చారు. అనేక మంది ప్రజలు సమాధికి కూడివచ్చారు. దేహాన్ని సమాధిలో పెట్టిన తర్వాత అందరూ పక్కకు వచ్చేశారు. ఒక్క వ్యక్తి మాత్రం అక్కడ నుండి కదల్లేదు. అక్కడే నిలబడి సమాధిని విడిచిపెట్టకుండా వెక్కిళ్ళుపెట్టి ఏడుస్తూ ఉన్నాడు. ఎవరో ఒక వ్యక్తి వచ్చి ఆయనను నీవు ఎవరవు? డేవిడ్ లివింగ్‌స్టన్ నీకేమవుతాడు? అని అడుగుతాడు. అందుకాయన మెడికల్ కాలేజ్‌లో నేను, డేవిడ్ లివింగ్‌స్టన్ క్లాస్‌మేట్స్. డేవిడ్ క్లాసులో ఎప్పుడూ తెలివిగలవాడుగా, ప్రథమస్థానంలో ఉండేవాడు. ఏదో ఒకరోజు ఆయన ప్రపంచ ప్రఖ్యాతి చెందిన డాక్టర్‌గా పేరు తెచ్చుకుంటాడని మేమంతా అనుకున్నాము. ఆఫ్రికాకు మిషనరీగా వెళ్తున్నాడని తెలిసి మేమంతా అపహాస్యం చేశాం, నేను ఆయనను బుద్ధిహీనుడని అన్నాను. నీ సమయాన్నంతా వ్యర్థం చేసుకొంటున్నావు, దేవుడు కూడా ఇది మెచ్చడు అని అన్నాను. అయినా ఆయన అక్కడికే వెళ్ళాడు. నేను ప్రాక్టీసు కొనసాగించాను. కానీ నేను డేవిడ్ లివింగ్‌స్టన్ గురించి చదివాను, ఆయన జీవితంలో జరిగినవన్నీ విన్నాను. ఆ శరీరాన్ని ఇక్కడికి తీసుకొచ్చేటప్పటికి ఎంతగా కుళ్ళిపోయిందో నాకు తెలుసు. కానీ నాకు ఇప్పుడు అర్థమవుతుంది. డేవిడ్ తన జీవితంలోని ప్రాధాన్యతలు సరైన స్థానంలో ఉంచాడు. నేను నా కెరీర్‌కు ప్రాధాన్యత ఇచ్చి నా జీవితాన్ని అయోమయం, గందరగోళం చేసుకున్నాను. డేవిడ్ ఒక ఉద్దేశం కోసం బ్రతికాడు, ఒక ఉద్దేశం కోసం చనిపోయాడు. నేను ఎందుకు బతుకుతున్నానో, ఎందుకు చావబోతున్నానో కూడా నాకు తెలియదు.

యౌవనస్థులారా ఈ మాటలు జాగ్రత్తగా వినండి. ఊరికే బతకడం కంటే దేవుని ఉద్దేశాలకోసం చనిపోవడమే మేలు. లక్షలాదిమంది యువకులు ఎందుకు బ్రతుకుతున్నారో, చదువుతున్నారో వారికి తెలియదు. జీతం కోసం మాత్రమే నీవు చదువుతున్నావంటే నీ కంటే దౌర్భాగ్యుడు ఎవరూలేరు. జీతం కోసం చదువుకుంటుంటే తప్పకుండా నిరుత్సాహాన్ని ఎదుర్కొంటావు. సత్యం కోసం, ఒక కారణం కోసం జీవించు. మన ప్రభువైన యేసుక్రీస్తు కొరకు జీవించడం కంటే ముఖ్యమైన కారణం మరేం కావాలి నీకు. సువార్త ప్రకటించడం కోసమే బ్రతుకు. దేవుని రాజ్యవ్యాప్తి కొరకు మాత్రమే బతుకు, ఆయనకు శిష్యులుగా చేయడం కోసమే బతుకు. ఆయన పరిశుద్ధాత్మ శక్తి ద్వారా పనిచేయి. అనేకుల ను దేవుని దగ్గరకు నడిపించు. నీవు చనిపోయిన తర్వాత నీ సమాధి దగ్గర ఒక వ్యక్తయినా నిలబడి “ఒక కారణం కోసం బ్రతికాడు, అనేకులను దేవుని కోసం నడిపించి ఆయన జీవితాన్ని ముగించాడని” చెప్పాలి. జీతాల కోసం, సంపద కోసం, ఇళ్ళ కోసం, వాహనాల కోసం బతకవద్దు. దేవుని కోసం బతుకు. దేవుని ప్రాధాన్యతల వైపుకు నీ వెంట ఉన్న వారిని నడిపించు. మిమ్మల్ని వెంబడించేవారు, మీ బోధలు వినే వారందరూ యెహోవానే సేవించే విధంగా చూడాలి. మీరు జీవించడానికి దేవుడు మాత్రమే కారణమయ్యేట్లుగా చూడండి. ఒకరోజు మనం కూడా ఈ లోకాన్ని విడిచిపెడతాము గనుక ఈ మూడు ప్రశ్నలు మనం వేసుకోవాలి:

1. నేను నా జీవితాన్ని చక్కగా జీవించానా?
2. దేవుని వాక్యానికి గౌరవాన్ని ఇచ్చానా?
3. నాకిచ్చిన పనిని చక్కగా సంపూర్తి చేశానా?

అలా జీవించిన వ్యక్తులతో దేవుడు భళా! నమ్మకమైన మంచి దాసుడా, నాతో కూడా విశ్రాంతిలో ప్రవేశించు అని చెప్పబోతున్నాడు.

## నేర్చుకోవలసిన మూడు సూత్రాలు:

**1. దేవుడు నీకు ఒక పనిని అప్పగించినప్పుడు దాని తీవ్రతను, గొప్పతనాన్ని గమనించి కృంగిపోవద్దు, ఆగిపోవద్దు.**

నీకిచ్చిన పనిని చేయడానికి తగిన రీతిలో సంసిద్ధపరచేవాడు మన దేవుడు. ఆయన నీకిచ్చిన గొప్ప పనిని చూసి అక్కడే ఆగిపోకు. యొర్దాను నది పారుతూ ఉండవచ్చు. యెరికో కోటగోడలు

చాలా దుర్భేధ్యంగా ఉండవచ్చు. లోపలున్న వ్యక్తులు చాలా బలవంతులు కావచ్చు. కానీ ప్రభువైన దేవుడు యెహోషువాను తన పనిని చేయడానికి సంసిద్ధునిగా చేస్తున్నాడు. యొర్దాను ప్రక్కనే నిలబడి ఆగిపోవలసిన పనిలేదు. దేవుని సహాయంతో దానిని దాటవచ్చు.

యౌవనస్థులారా దేవుడు మీకు ఏ పని అప్పగించబోతున్నారో భవిష్యత్‌లో నాకు తెలియదు. దేవుడు మీకు అప్పగించిన పనిని చూసి, దాని వైశాల్యాన్ని చూసి భయపడి ఆగిపోవద్దు. నీవు ఆ పని చేయాలని దేవుడు చెబితే నువ్వే చేయాలి. ఆయన నీకు ఏ పని అప్పగించాడో ఆ పనిని చేయడానికి అన్నిటినీ సమకూర్చేవాడు ఆయనే. ఇదే ప్రభువైన యేసుక్రీస్తు మత్తయి సువార్తలో తన శిష్యులతో చెప్పాడు. నాకోసం శిష్యులను చేయండి. నేను మీతో కూడా సదాకాలం ఉన్నాను. వెళ్ళండి.

**2. మన దేవుడు మరణించలేదు. దేవుని పనిలో మన ముందున్న సవాళ్ళను చూసినప్పుడు భయపడవద్దు, జడియవద్దు.**

మోషే, మన నాయకులు చనిపోవచ్చేమో గానీ మన దేవుడు మరణించలేదు కాబట్టి ఒక పనిని మనముందుంచినప్పుడు భయపడవద్దు. ఆయన సజీవుడు. మనతో మాట్లాడుతున్నాడు. ఆయన పరిశుద్ధాలయంలో సింహాసనం మీద కూర్చొని ఉన్నాడు. ఆయన చూస్తున్నాడు, పరీక్షిస్తున్నాడు, ఆయన నీ గురించి చింతిస్తున్నాడు. నీ జీవితం పట్ల ఒక ప్రత్యేకమైన ప్రణాళిక కలిగి ఉన్నాడు. ఫిలిప్పీ 1:6లో గమనిస్తే నీలో కార్యాన్ని మొదలు పెట్టినవాడు దాన్ని ముగిస్తాడు. ఏ భయం లేకుండా ఆయన మీద నమ్మకముంచు, ఆయనతో కలసి పనిచేయి. పరిచర్యలో సవాళ్ళుండటం ఎంతో మంచిది. అవి లేకపోతే మనమీదే మనం ఆధారపడే వ్యక్తులంగా ఎదుగుతాం. సవాళ్ళు రావడం ద్వారా మనం దేవునిమీద ఆధారపడటం నేర్చుకొంటాము.

**3. దేవుని పనిలో అలసిపోకు:**

మన ప్రయాణం ఇంకా ముగియలేదు. ఇంకా చేయాల్సిన పని ఎంతో ఉంది. ఇంకా ఇంటికి చేరలేదు ఎంతో చేయాల్సింది ఉంది.

విదేశాల్లో 40 సంవత్సరాలు మిషన్ ఫీల్డ్‌లో సేవచేసిన మిషనరీ దంపతులు యునైటెడ్ స్టేట్స్‌లోని తమ ఇంటికి ఒక ఓడలో తిరిగి వస్తున్నారు. వీరు ప్రయాణం చేస్తున్న ఓడలోనే అమెరికా అధ్యక్షుడు కూడా ప్రయాణం చేస్తున్నాడు. ఆ షిప్ తీరానికి చేరగానే ప్రెసిడెంట్‌కు గొప్పగా ఆహ్వానం పలకడానికి ఆ ఓడరేవుకు అనేకమంది ప్రజలు, మిలట్రీ నుండి, ఎయిర్‌ఫోర్స్ నుండి వచ్చారు. అవన్నీ చూచి మిషనరీ భార్య మిషనరీతో ఇలా అంది "40 సంవత్సరాలు మనం దేవుని పరిచర్య చేసి తిరిగి వస్తున్నాం మనకి ఆహ్వానం పలకడానికి ఒక్కరు కూడా లేరా?" అప్పుడు మిషనరీ తన భార్యవైపు చూసి 'ఇంకా మనం ఇంటికి చేరలేదు గదా!' అని అన్నాడు.

నిజమే! మనం ఇంకా ఇంటికి చేరలేదు. మనం పరదేశులం, యాత్రికులం. ఉప్పులాగ, వెలుగులాగ ఉండడానికి మాత్రమే పిలువబడ్డాము. ఒకరోజు అక్కడికి చేరతాం. అప్పటి వరకు మన ప్రయాణం పూర్తి కాలేదు. ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. పొలం మన ముందు ఉంది. ఆ పని చేయడానికి దేవుడు తన బిడ్డలను సంసిద్ధపరుస్తున్నాడు. అనేకమంది ఈ మధ్యలో చనిపోతూ, శ్రమల్ని ఎదుర్కొంటూ ఉండవచ్చు.

అపొస్తలుల కార్యాలు 7వ అధ్యాయంలో స్తెఫనును రాళ్ళతో కొట్టి చంపేటప్పుడు ఆయన ఆకాశం వైపు తేరి చూశాడు. యేసుక్రీస్తు అన్ని చోట్ల తండ్రి కుడిపార్శ్వమున కూర్చున్నట్లు రాయబడి ఉంది. కానీ ఇక్కడ మాత్రమే తన కోసం మరణిస్తున్న ఒక సేవకుని చూసినప్పుడు యేసుప్రభువు లేచి నిలబడ్డారు. నీవు గొప్ప పరిచర్య చేస్తే నీకోసం ప్రభువు లేచి అలా ఆహ్వానిస్తాడు. భళా నమ్మకమైన మంచి దాసుడా రా నా విశ్రాంతిలో ప్రవేశించు అన్న ఆయన మాటల కంటే ఇంకేం కావాలి? అదే మిమ్ముల్ని నడిపించనివ్వండి. ఆ తపన మీలో నిలిచి ఉండనియ్యండి. అనేక కళాశాల ప్రాంగణాలకు మీ ద్వారా సువార్తను అందించండి. దేవుని కొరకు జీవించండి. అనేకులను దేవుని కొరకు నడిపించండి. మీరు వెళ్ళిన తర్వాత కూడా ఒక వారసత్వాన్ని అక్కడ విడిచి వెళ్ళండి. కొందరైనా నీ సమాధి దగ్గర నిలబడి దేవుని కోసం జీవించాడు, అనేకులను దేవుని దగ్గరకు నడిపించాడు, ఒక వారసత్వాన్ని విడిచి వెళ్ళాడు అని చెప్పగలగాలి.

**- పాస్టర్. యం. సిమియోన్ సుందర్,**
బెంగళూరు

(ట్రైకాన్ 2017 చివరి రోజు ఎక్స్‌పోజిషన్ సారాంశం)

ప్రత్యేకం



# యోసేపు

## దేశాన్ని ప్రభావితం చేసిన నాయకుడు

నాయకత్వంలో ముఖ్య అంశం ఇతరుల ను ప్రభావితం చేయడమే అని డా॥ హ్యాంగ్‌టన్ అంటారు. క్రైస్తవ నాయకత్వం అంటే ప్రభువైన క్రీస్తు జీవనశైలిని కలిగి ఇతరులకు పరిచర్య చేసే దృక్పథం కలిగి ఉండటమే. ప్రభువైన క్రీస్తు ప్రపంచాన్ని ప్రభావితం చేశారు. ఆయన జన్మ, జీవితం, మరణం, పునరుత్థానం, రాకడ..మొదలైనవన్నీ ప్రపంచాన్ని అత్యంత ప్రభావితం చేసిన అంశాలే. చివరకు ఆయన సిలువ మరణం చూసిన శతాధిపతి కూడా ప్రభావితమై 'నిశ్చయంగా ఈయన దేవుని కుమారుడని' చెప్పాడు (మార్కు 15:39). గనుక ఆయనే ప్రపంచాన్ని అత్యంత బలంగా ప్రభావితం చేసిన ఏకైక నాయకుడు. ఆయన బోధలు, జీవనశైలి, సర్వమానవాళికి ఆదర్శం. ఆయన తగ్గింపు జీవితం, త్యాగపూరిత మరణం, దు:ఖపడేవారిని ఓదార్చడం మరువలేని జీవిత పాఠాలు.

ప్రభువైన క్రీస్తుకు ముంగుర్తుగా పాతనిబంధనలో యోసేపు జీవితాన్ని మనం స్పష్టంగా చూడవచ్చు. అయితే యోసేపు జీవితంలోని నాయకత్వ లక్షణాలు, దినదినం నాయకునిగా ఎలా అభివృద్ధిచెందాడో మనం చూద్దాము.

### 1. దేవుని సంకల్పాన్ని నమ్మడం

యోసేపు దేవుడిచ్చిన కలలను నమ్మాడు. తన అన్నదమ్ములకు, తండ్రికి కూడా తన కలలను చెప్పాడు. ఆ భావం అర్థం అయ్యి తండ్రి కూడా గద్దించాడు గాని కలలు అనేవి మన ఇష్టానుసారంగా కనేవి కావు. గాని యోసేపుకు ఒక విషయం అర్థమైంది. దేవుడు తన జీవితంలో పనిచేస్తున్నాడని గ్రహించాడు.

నిజమైన నాయకత్వ లక్షణం ఇదే. దేవునికి తన జీవితం పట్ల ఓ నిర్దిష్ట లక్ష్యం ఉంటుందని నమ్ముతాడు.

### 2. నమ్మకత్వం

ఆదికాండము 39వ అధ్యాయంలో దేవుడు యోసేపునకు తోడైయుండెనని 5 సార్లు చూస్తాం. 'అతని పనిని ఆశీర్వదించి, సఫలము చేసెనని' అనే మాటలను కూడా చూస్తాము. అతడు ఎంత ఎదిగి నా, దీవించబడినా "నమ్మకత్వం"నకు మారుపేరుగా జీవించాడు. ఎక్కడా విలువలకు రాజీపడలేదు. పోతీఫరు భార్య ద్వారా శోధనకు గురైనా "అతడు ఒప్పక నా యజమానుడు తనకు కలిగినదంతయు నా చేతికప్పగించెను గదా, నా వశమున తన యింటిలో ఏమి ఉన్నదో అతడెరుగడు. ఈ యింటిలో నా కంటె పైవాడు ఎవడును లేడు. నీవు అతని భార్యవైనందున నిన్ను తప్ప మరి దేనిని నా కప్పగింపకయుండలేదు. కాబట్టి నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందునని తన యజమానుని భార్యతో అనెను" (ఆది 39:8,9).

పోతీఫరు భార్య తన యజమానురాలని, తను దాసుడు అనే విషయం యోసేపుకు స్పష్టంగా తెలుసు. తన యజమానునికి నమ్మకద్రోహం చేయకూడదు అనే విచక్షణ ఉంది. తన స్థానం ఏంటో చక్కగా ఎరిగినవాడు. కానీ పోతీఫరు భార్యకు ఆ విచక్షణ లేదు. యోసేపు పరాయి పురుషుడు, నా భర్తకు నేను నమ్మకద్రోహం చేస్తున్నాను అనే విచక్షణ కోల్పోయింది.

యోసేపు దేవునికి, తన యజమానునికి నమ్మకంగా ఉన్నాడు. తన చిన్నతనం నుంచే చెడుకు దూరంగా ఉండటం అలవాటు చేసుకున్నాడు (ఆది 37:2).

జీవిత ప్రయాణంలో కొనసాగుతున్నప్పుడు, దేవుడు మనల్ని ఆశీర్వదించేకొలదీ, ఎంతో ఎత్తుకు ఎదిగేకొలదీ, దేవునికి దూరమయ్యే శోధనలు అనేకం వస్తాయి. శోధనలు మనల్ని విచక్షణ కోల్పోయేలా చేస్తాయి. ఈ విచక్షణ కోల్పోతే నేను దేవుని బిడ్డను అని మరచి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తుంటాము. అయితే 'నమ్మకత్వం, దేవుని భయం' కలవారు దేవునిలో స్థిరంగా నిలుస్తారు.

## 3. సహనం

ఐగుప్తు రాజు యొక్క ఉద్యోగులు తప్పు చేసినప్పుడు వారిని యోసేపు బంధింపబడిన స్థలములో రాజు ఉంచాడు. "ఆ సేనాధిపతి యోసేపు వశము చేయగా అతడు వారికి ఉపచారము చేసెను" (ఆది 40:4). తరువాత వారిద్దరికీ కలలు వచ్చినప్పుడు ఇద్దరికీ వారి కలల భావాలను విడమర్చి చెప్పాడు. పానదాయకుడు, రాజుగారికి గిన్నె అందించు అధికారికి తనను గూర్చి రాజుతో మాటలాడమని కోరాడు. "కాబట్టి నీకు క్షేమము కలిగినప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొని నాయందు కరుణించి ఫరోతో నన్ను గూర్చి మాటలాడి యీ యింటిలో నుండి నన్ను బయటకు రప్పించుము. ఏలయనగా నేను హెబ్రీ దేశములో నుండి దొంగిలించబడితిని. అది నిశ్చయము. మరియు ఈ చెరసాలలో నన్ను వేయుటకు ఇక్కడ సహా నేనేమియు చేయలేదని అతనితో చెప్పెను" (ఆది 40:14,15).

అయితే ఆ పానదాయకుడు తన ఉద్యోగం వచ్చాక యోసేపును మరచిపోయాడు. అది ఎంతో నిరుత్సాహం తెచ్చే అంశం. కానీ క్రీస్తు ప్రభువువలె సేవా నాయకత్వం కలిగి దేవుని సమయం కొరకు సహనంతో కనిపెట్టుకొని ఆయనపైనే ఆధారపడ్డాడు. నిజమైన క్రైస్తవ నాయకత్వం దేవునిపై ఆధారపడుతుంది. మన చేతుల్లో లేని దాని కోసం తొందరపడక, నిరుత్సాహపడక ఆయనపైన సహనంతో ఆధారపడాలి.

## 4. దేవునిని మహిమపరచడం, చక్కని ప్రణాళిక

దేవునిపై ఆధారపడిన యోసేపుకు రెండేళ్ళ తర్వాత దేవుని సమయంలో విడుదల కలిగింది. ఫరోకు కల ద్వారా దేవుడు తాను చేయబోవుచున్న కార్యమును చూపించాడు (ఆది 41:28). ఫరోకు కలను వివరించకమునుపు యోసేపు దేవుని ఘనపరచెను. యోసేపు - నా వలన కాదు, దేవుడే ఫరోకు క్షేమకరమైన ఉత్తరమిచ్చునని ఫరోతో చెప్పి దేవునిని మహిమపరచాడు.

నిజమైన పరిపక్వత కలిగిన నాయకుడు ప్రజలను తనవైపు కాక దేవునివైపు దృష్టి సారించేలా చేస్తాడు.

సమృద్ధియైన పంటను కరువు కాలంలో ఎంతో చక్కగా ఉపయోగపడేటట్లు ప్రణాళికను రచించాడు.. "ఐగుప్తు దేశమందున్న యేడు సంవత్సరములు ఆహారమంతయు అతడు సమకూర్చి ఆయా పట్టణములలో దాని నిలువచేసెను" (ఆది 41:48).

నాయకుడు సంక్లిష్ట పరిస్థితులలో సురక్షితంగా మనం వెళ్ళేటట్లు ఆత్మీయ ప్రణాళికలను వేస్తాడు. యెహోషువ వేగుల వారిని పంపడం అతని ప్రణాళికల్లో భాగమే. ఈరోజుల్లో కూడా సువార్త అందరికి వినిపించలేని, కష్టతర పరిస్థితులలో ఆత్మీయ నాయకుడు ప్రణాళికలను వేస్తాడు. దేవుడిచ్చిన దర్శనానికి, విద్యార్థుల కోసం సువార్తను అందించే క్రమంలో శిష్యత్వ శిక్షణలో భాగంగా ప్రణాళికలను వేద్దామా?

ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులముగా, ఆత్మీయ నాయకులముగా యోసేపువలె మన ప్రభువైన క్రీస్తును పోలి ఎదుగుదాము. అట్టి కృప, పరిశుద్ధాత్మ దేవుని సహాయం దేవుడు సమృద్ధిగా మనకు దయ చేయును గాక! ఆమెన్

**- దాసరి రాజేష్**
తెలంగాణా స్టేట్ సెక్రటరీ, హైదరాబాద్

# ADMISSIONS OPEN FOR 2022-23

Dr. BRR's
GEN
The ...
Medical & I...

## GLORY TO GOD FOR HIS FAITH FULNESS AND ABUNDANT BLESSING

**Dear Brothers/ Sisters in Christ Greetings from Dr. B.Raja Ratnam to all of you in the name of our Lord and Sa... in your prayers. We are able to run this institute successfully only by the Grace of God withstanding the tough... worship service, EBS, BBS, EC, DT and LT programmes being conducted in our campus.**


D.Joseph Samuel
RIMS - Ongole
Cell : 7661052421


Basha -MBBS
Ananthapur Medicl Colg
7680085869


Bhavana - MBBS
AIIMS - Raipur
8688514956


Nikhilesh - MBBS
KMC - Kurnool
7794942739


M. Jyothsna
MBBS - KMC-Guntur
9848332137


Blesson
MBBS - SRMC-Nandyal
9490552348


Bhargav
MBBS - VISWABARATHI - Kurnool
9391617237


Lal Chand
MBBS - SVIMS - Tirupathi
9000390178


Venkata Sai
MBBS - ANANTPUR MEDICAL Colg
9959852924


Uday Kumar
MBBS - ACSR - Nellore


Monalisa
MBBS - GMC - Nalgonda


Jerusha joseph
BVSC - Proddatur
7416762409


CH. Anupada
BVSC - Proddatur
9701712443


Yashes chandra
Ag.BSC - ANGRAU Bapatla
6305514399


Vanya Sri
Pharm-D Vijaya Colg Vijayawada
6300862259


J. Jayanth
Horticulture - Dr YSRHU
7075827021


Ujwal Manoj
Horticulture - Dr YSRHU
8096616383


GraceMahlah
BTech - SRKR - Bhimavaram
9100399817


Neethi Jerusha
Vishnu Eng. Colg Bhimavaram
9491171842


K. Koushik
NIT - Durgapur
8919561815


Ranjith
NIT - Caulicut
7702070020


Sofia Prabha
GFTI - NIT - Pondicherry
9885435559


Kumar Babu
GFTI - NIT - Pondicherry
9618754346


R. Jacob Arpan
B,Tech. - RVRJC - Guntur
7780699472


M. Isaac Srihas
B,Tech. - PVPS - Vijayawada
9493857545


Vishesh
BTech - PULLAREDDY - Kurnool
9989003801


Ashish Paul
SRM - Chennai

Ac

**BiPC stream :**

**No. of students admitted – 100**
**No. of students withstood Corona and**
**physically from GENESIS – 46**
**No. of seats achieved : M.B.B.S - 22,**
**AGRICULTURE - 03, HORTICULTURE -**

**70% SUC**

ESIS
Academy of Excellence
IT Academy

**MANAGING DIRECTOR**
**Dr. B. RAJARATHNAM**
**7330848144**

## GS SHOWERED UPON GENESIS SINCE INCEPTION (2018) TO TILL DATE

viour, Jesus Christ . I extend my whole hearted thanks to each one of you who remembered Dr BRR's GENESIS
n situations of Corona. Our students are excelling in studies as well as in spiritual standards through the regular


Pavan Teja
MBBS - PES-MC-kuppam
6304204603


Amulya Ratna
MBBS - AMC - Ananthapur
9177811128


Yemima Grace
MBBS - St.Johns,Bglr
9491133767


Sathvik Isaac
MBBS - St. Johns, Bglr
9441948795


G. Jayanth
MBBS - KMC - Kurnoo
9652825411


M.Rhoda Gideon
MAMATA - Medical college, Hyd
9866652120


Sandhya
MBBS - SVIMS - Tirupathi
9014075868


Kavya
MBBS - MALLAREDDY - Hyd
9848067989


Sony
MBBS - NARAYANA MEDICAL Colg
7702070020


S. Yeswanth
MBBS - OSMANIA MEDICAL Colg
9849475615


N. Yeswanth
MBBS - MAHARAJA MEDICAL Colg
8639705656


Jahid
MBBS - ASRAM MEDICAL Colg - ELR
9573159140


D. Harshavi
Horticulture - Dr YSRHU
9492971570


Mercy
Community Science ANGRAU
9491133767


D. Amulya
Home Science - ANGRAU
9866949975


Philomina
BTech - SRKR - Bhimavaram
7075213720


P. Moses Donald
IITian - Karagpur
9515449489


Gracy
JNTU Ananthapur
7013760620


V. Charan Sree
JNTU - Ananthapur
7075806568


Benjamin Royal
JNTU - Pulivendula
9010352077


Raj Kumar
JNTUH
9676356325

## chievements of Dr BRR's GENESIS – 2021

appeared for NEET

VETERINARY - 02,
03, OTHERS - 02

CESS

**MPC Stream :**

No. of students admitted – 30
No. of students withstood Corona and appeared for JEEMAINS physically from GENESIS – 12
No. of seats achieved : IIT - 01, NIT - 04, JNTU - 04, OTHERS - 03

**100% SUCCESS**



# విద్యార్థి నాయకత్వం ఎంతో విలువైనది

భారతదేశంలో అనేకమంది ప్రజలు ఉన్నారు, వారిలో దేవునిని అంగీరించినవారు కొందరే. దైవసేవకులు అనేకమంది ఉన్నారు, దైవజనులు కొందరే. నాయకులు అనేకమంది ఉన్నారు, క్రీస్తును పోలినవారు కొందరే. విశ్వాసులు అనేకమంది ఉన్నారు, విశ్వాసంతో జీవించేవారు కొందరే. గొప్ప, గొప్ప వ్యక్తుల నాయకత్వంలో పనిచేసే సంస్థలు ఎన్నో ఉన్నాయి, వారిలో విద్యార్థి నాయకత్వం వహించే సంస్థలు కొన్నే ఉన్నాయి అనడంలో అతిశయోక్తి లేదు.

### 1. విద్యార్థుల నాయకత్వం సమాజానికి అవసరమా?

అవసరమనే చెప్పాలి. విద్యార్థులు నాయకులుగా పనిచేయడం కొత్త అంశం, విశేషం అంతకన్నా కాదు. ఎందుకంటే పాఠశాల స్థాయి నుండి క్లాస్ లీడర్, స్కూల్ యస్పియల్ వరకు విద్యార్థులే లీడర్‌షిప్‌ని కలిగి ఉంటున్నారు. కళాశాల స్థాయిలో పనిచేసే యస్‌యఫ్ఐ, ఐయుయస్‌యఫ్, ఏబివిపి వంటి సంస్థలలోను విద్యార్థులే నాయకులుగా ఉండి ఎన్నో కార్యక్రమాలను అమలుచేస్తున్నారు.

గత కొన్ని సంవత్సరాల క్రితం ముస్లిం యువతుల విద్య కోసం అలుపెరుగని పోరాటం చేసి, మరణపు అంచుల వరకు వెళ్ళి మృత్యువును జయించి, తను అనుకొన్నది సాధించిన 16 సంవత్సరాల అమ్మాయి 'మలాల'ను చూస్తే ఆమె పోరాట పటిమ, విద్యార్థి నాయకత్వం ఎంత బలమైనదో అర్థం అవుతుంది.

నిన్నటికి నిన్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించింది ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకులే అని అనటంలో అతిశయోక్తి లేదు. ఒక విద్యార్థి నాయకుడు తలచుకొంటే రాష్ట్ర ఆవిర్భావం, రాష్ట్ర అభివృద్ధి అంతేకాదు రాష్ట్ర వినాశనం కూడా చేయగలడు. అంతబలమైనది, ప్రాముఖ్యమైనది విద్యార్థి నాయకత్వం.

### 2. విశ్వాస విద్యార్థిగా నాయకత్వం దేవుడు నీకిచ్చిన ఆధిక్యత

సాధారణమైన విద్యార్థి ఒక నాయకుడిగా ఎంతో ప్రభావం కనపరచినప్పుడు ఒక విశ్వాస విద్యార్థిగా, నాయకునిగా నీవు ఎంత ప్రభావం చూపించవచ్చు. అంతగొప్ప అవకాశం యుఇఎస్ఐ పరిచర్య కల్పించడం దేవుని కృపయే. ఈ పరిచర్య – ప్రతి విద్యార్థికి రక్షణ సువార్తను అందించి, రక్షణ

పొందిన వారిని యేసుక్రీస్తు శిష్యులుగా చేసి, తర్వాత నాయకులుగా తర్ఫీదు ఇచ్చి వారు తమ కళాశాలల్లో దేవుని కొరకు నాయకులుగా పనిచేసే అవకాశం కల్పిస్తుంది.

ఎంతోమంది విద్యార్థులు ఉన్నారు కానీ దేవుడు నిన్ను రక్షించుకొన్నాడు. ఎంతోమంది విశ్వాసులు ఉన్నారు కానీ దేవుడు నిన్ను నమ్మి మీ ఇయులో నాయకునిగా బాధ్యతను అప్పగించాడు. ఇది దేవుడు నీకిచ్చిన ఆధిక్యత, దీన్ని చులకనగా తీసుకొని, దేవుడిచ్చిన అవకాశాన్ని పాడుచేసుకోకు.

నీవున్న కళాశాలలో విశ్వాస విద్యార్థిగా, నాయకునిగా నీ బాధ్యతల విషయంలో ఎంతో నమ్మకంగా ఉండాలి. ఇయు పరిచర్యలో, సంఘ పరిచర్యలో, కుటుంబంలో నీ బాధ్యతల విషయంలో అంతే నమ్మకంగా భారం కలిగి ఉండాలి. కళాశాలలో జరిగే కొన్ని అసాంఘిక కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ మనదైన ముద్రను నిలిపే విధంగా విశ్వాస నాయకుడు ఉండాలి. ర్యాగింగ్, ఎగ్జామ్స్‌లో కాపీయింగ్, లంచం, సెక్సువల్ ఎబ్యూజింగ్, టీజింగ్ మొ॥న అంశాలపై పోరాటం చేస్తూ మాదిరికరమైన జీవితంలో చెరగని ముద్రవేసి క్రీస్తును కనపరిచేవారిగా ఉండాలి. నాయకత్వం అనేది ఒక పదవి కాదు, క్రియలతో కూడినది.

## 3. విశ్వాస విద్యార్థి నాయకునిగా నీకు ఉండాల్సిన ఆత్మీయ విలువలు, బాధ్యతలు

"ఒక నాయకుని విలువ అతని విలువలను బట్టే ఉంటుంది".

### ఆత్మీయ విలువలు

1. **పరిశుద్ధత:** "నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులై ఉండుడి". పరిశుద్ధత కోసం పారిపోయిన యోసేపును పోలి మన జీవితం ఉండాలి.
2. **నమ్మకత్వం:** మనకు అప్పగించిన బాధ్యతలో నమ్మకంగా పని చేయాలి. మనం దేవునికి, దేవుని బిడ్డలకు లెక్క అప్పజెప్పాల్సి ఉందని గ్రహించాలి. భళా, నమ్మకమైన మంచి దాసుడా అనిపించుకోవాలి.
3. **యథార్థత:** సంఘంలో, సహవాసంలో లేదా ఒంటరిగా ఉన్నప్పుడు కూడా యథార్థతను వీడకూడదు.
4. **నేర్చుకొనే స్వభావం:** నాకన్నీ తెలుసులే అనే స్వభావం కన్నా, పెద్దల దగ్గర నుండి, చిన్నవారి దగ్గర నుండి ఇతరుల దగ్గర నుండి కూడా ఎన్నో విషయాలను నేర్చుకోవడానికి ఆసక్తి కనపరచాలి.
5. **సరిచేసుకోవడానికి ఇష్టపడాలి:** మనలోని లోటుపాట్లను ఇతరులు చెప్పినప్పుడు అంగీకరించాలి, సరిచేసుకోవడానికి ఇష్టపడాలి. "మేలుకోరి స్నేహితుడు గాయపరచును, పగవాడు లెక్కలేనన్ని ముద్దులు పెట్టును".
6. **క్షమాపణ:** ఇతరులను క్షమించే అనుభవం, ఇతరుల పట్ల క్షమాపణ అడిగే అనుభవం కలిగి ఉండాలి. "అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరం పొందును".
7. **మాదిరికర జీవితం:** 1 తిమోతి 4:12. మాటలలో, ప్రవర్తనలో, చూపులో, ప్రేమలో, విశ్వాసంలో, పవిత్రతలో మాదిరిగా ఉండాలి.
8. **తగ్గింపు స్వభావం:** మార్కు 10:44. తనను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును. తనను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును.
9. **సాక్ష్యజీవితం కాపాడుకొనుట:** వందమాటలు మాట్లాడే కన్నా ఒక మాదిరికరమైన క్రియ ఎంతో ప్రభావం చూపిస్తుంది.
10. **సేవాగుణం:** ఇతరులకు సేవ చేయడంలో, మనవంతు సహాయ సహకారాలు అందించడంలో ముందుండాలి. యేసుప్రభువు శిష్యులు పాదాలు కడిగేంతగా తగ్గించుకొన్నారు, అట్టి మాదిరిని మనం కలిగి ఉండాలి. అధికారికి నాయకునికి ఉన్న గొప్ప వ్యత్యాసం ఏంటంటే 'అధికారి వెళ్ళు, చేయి' అంటాడు, లీడర్ 'వెళదాం, చేద్దాం' అని అంటాడు.

"మనమెంత దూరం నడిచి ప్రసంగించినప్పటికీ మన నడత ద్వారా క్రీస్తును ప్రసంగించనిచో వ్యర్థమే" అని అంటాడు డి.ఎల్. మూడీ

### బాధ్యతలు

విశ్వాస విద్యార్థి నాయకునిగా ముఖ్యంగా 3 విషయాలలో (ఇయు పరిచర్య, సంఘము, కాలేజ్) విలువైన బాధ్యతలు కలిగి ఉండి, ఇచ్చిన పనిని నమ్మకంగా చేయగలిగి ఉండాలి.

## 1. ఇయు పరిచర్య

**కమిటీ మెంబర్:** కమిటీ మీటింగ్స్‌లో యాక్టివ్‌గా పాల్గొనాలి. ప్రతి మీటింగ్‌కు తప్పకుండా హాజరు కావాలి. కమిటీలో పనిచేయడం వలన పరిచర్య పట్ల భారం, బాధ్యత, ఎన్నో విషయాల్లో అవగాహన పెరుగుతుంది.

**ఔట్‌రీచ్:** నేను (అనిల్) స్టూడెంట్‌గా ఉన్నప్పుడు ఔట్‌రీచ్ ఇన్‌ఛార్జిగా బాధ్యత అప్పగించారు. సెలవులు రాగానే ఇంటికి వెళ్ళడం అనేది ప్రతి విద్యార్థి సాధారణంగా చేసే పని. ఒకసారి నేను ఇంటికి వెళ్ళకుండా 15 రోజులు వేసవి సెలవుల్లో గుంటూరు జిల్లాలోని ఔట్‌రీచ్ ప్రదేశాల్లో విజిట్ చేసి ప్రార్థన చేయడానికి దేవుడు నన్ను ప్రేరేపించిన వెంటనే నేను ఆ పనిచేశాను. తర్వాత ఆ ప్రాంతాల్లో చక్కని పరిచర్యను చూడగలిగాను. ఇది నా పరిచర్య జీవితానికెంతో ప్రోత్సాహకరం.

**బైబిల్‌స్టడీ:** బైబిల్‌స్టడీ లేనిచోట బైబిల్‌స్టడీ ప్రారంభించడానికి విద్యార్థి నాయకునిగా చొరవ చూపించాలి. మన కళాశాలలో బైబిల్ స్టడీ విషయంలో మనమే బాధ్యత వహించాలి. అలాగే బైబిల్ స్టడీస్‌కు మిస్ అవ్వకుండా హాజరవ్వాలి. అలానే బైబిల్ స్టడీ తీసుకొనే సామర్థ్యం కలిగి ఉండాలి.

**క్యాంప్స్:** చదువును బ్యాలెన్స్ చేసుకొంటూ సాధ్యమైనంతవరకు అన్ని క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లకు తప్పకుండా హాజరవ్వాలి. నేను విద్యార్థి దశ నుండి ఇప్పటివరకు కొన్నిటికి తప్ప మిగతా అన్నింటికీ రెగ్యులర్‌గా హాజరయ్యాను. అవి నా ఆత్మీయ జీవితానికి, ఒక నాయకునిగా ఉండడానికి ఎంతో తోడ్పడ్డాయి. ఈ రోజుల్లో 1 లేదా 2 సార్లు క్యాంప్స్‌కు హాజరైతే చాలు అనుకొంటున్నారు. క్యాంప్స్‌కి తోటి విద్యార్థులను దగ్గరుండి తీసుకెళ్ళాలి. మా దగ్గర ఒక తమ్ముడు వేసవికాలంలో కూలి పనికి వెళ్ళి నలుగురు విద్యార్థులను క్యాంప్‌కు తీసుకెళ్ళి రిజిస్ట్రేషన్ తనే చేయించాడు. ఈ రోజు ఆ తమ్ముడిని దేవుడు గొప్పగా ఆశీర్వదించాడు. దేవుడు ఎంతో నమ్మదగినవాడు.

**యంపిసిం:** యంపిసి సెల్స్‌కి సీనియర్ స్టూడెంట్ అయినా యంపిసి ఇన్‌ఛార్జ్ అయినా మిగిలిన విద్యార్థుల బాధ్యత నీదే. గ్రాడ్యుయేట్‌కి, విద్యార్థులకు మధ్య వారధిగా ఉండాలి. వారిని నడిపించాలి.

**మెంటరింగ్:** ఒక నాయకుడిగా నీవు ఒక మెంటర్‌ని కలిగి ఉండాలి. లేకపోతే నీ ఆత్మీయ జీవితానికి అది మంచిది కాదు. అలాగే నీవు కొంతమంది మెంటీస్‌ని కలిగివుండి, వారిని మెంటర్ చేస్తూ ఉండాలి. లేకపోతే ఇతరులకు నీ జీవితం ఒక దీవెనగా ఉండలేదు.

**నీ తర్వాత నాయకుని సిద్ధపరచడం:** నీవు నీ కళాశాలనుండి ఔట్‌గోయింగ్ స్టూడెంట్‌గా వెళ్ళే లోపు ఒక విద్యార్థిని నీ తర్వాత తరానికి తయారు చేసి వెళ్ళాలి. పరిచర్య నీతోనే ఆగిపోకూడదు. నిజమైన నాయకుడు తనకు అనుచరుల్ని తయారు చేసుకోడు గానీ, ఎక్కువమంది నాయకుల్ని తయారుచేస్తాడు.

## 2. సంఘము

సంఘంలో కూడా ఒక విశ్వాస విద్యార్థి నాయకునిగా నీదైన సాక్ష్యం నెలకొల్పాలి. సండేస్కూల్ తీసుకోవాలి, సంఘ పరిచర్యలో కూడా చురుకుగా పాల్గొనాలి. మనవంతు సహాయ సహకారాలు అందివ్వాలి. పాస్టర్, సంఘ సభ్యులతో మంచి సంబంధాలు కలిగి ఉండి ఇయు పట్ల సరియైన అవగాహన కల్పించాలి. పాటలు పాడటం, వాయిద్యపరికరాలు వాయించడం, చాపలు వేయడం, క్రమంగా చర్చ్‌కి వెళ్ళడం వంటివి మంచి సాక్ష్యజీవితానికి నాందిగా ఉంటాయి.

## 3. కాలేజ్

నేను (పద్మిని) పి.జి. చదువుతున్న రోజుల్లో ఎగ్జామినేషన్ హాల్ అంతా విద్యార్థుల అల్లరితో మారుమ్రోగుతుంది. ఇంతలో సైలెన్స్ అనే శబ్దంతో అంతా నిశ్శబ్దంగా మారింది. ఇన్విజిలేటర్ వచ్చి అందరికీ ప్రశ్నాపత్రాలు ఇచ్చాడు. అర్ధగంట తర్వాత మరలా శబ్దాలు మొదలయ్యాయి. ఇన్విజిలేటర్‌కు ఈ పేపర్ చాలా టఫ్ అని అర్థమై కాపీయింగ్‌కు అనుమతించాడు. అందరూ హుషారుగా రాస్తున్నారు. నేను మాత్రం పేపరు క్లోజ్ చేసి నిశ్శబ్దంగా కూర్చున్నాను. ఇన్విజిలేటర్ వచ్చి నీవు ఎందుకు కాపీ చేయడంలేదు అని అడుగగా, సర్ నేను క్రిష్టియన్‌ని. కాపీ చేయడం తప్పు. అందుకే రాయలేదు అని చెప్పగానే ఎంతో సంతోషించి, లేపి అందరితో 'ఇలాంటి ఒక అమ్మాయి ఉంటే చాలు మన దేశం బాగుపడుతుంది' అని చెప్పి క్లాప్స్ కొట్టించారు. వెంటనే నేను మర్యాదగా 'సర్, మీలాంటి ఒక ఇన్విజిలేటర్ ఉంటే చాలు బాగుపడిన దేశం పాడైపోతుంది' అని బదులిచ్చాను. దాంతో అయన

ఉలికిపడి తన డ్యూటీ గుర్తుకు వచ్చి కాపీయింగ్ నిలిపివేసి చక్కగా విధి నిర్వహించారు. అప్పుడు నేను ఇయు కమిటీలో సెక్రటరీగా పనిచేస్తూ ఉన్నాను.

స్టడీస్‌లో ఎక్సెల్ అవ్వడం, ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్‌లో చురుకుగా పాల్గొనడం ద్వారా మా కాలేజ్‌లో మంచి సాక్ష్యం లభించింది. తద్వారా గాస్పల్ ఈవినింగ్స్, క్రిస్మస్ ఫంక్షన్స్‌కి విద్యార్థులను ఆహ్వానిస్తే వారందరూ వచ్చేవారు. కళాశాలలో మన ఉనికిని అందరూ గుర్తించే విధంగా, విశ్వాస విద్యార్థి నాయకులుగా మనం ఎదగాలి, పనిచేయాలి.

ఇప్పటివరకు పైన చర్చించిన అంశాలను బట్టి చూస్తే ఒక విశ్వాస విద్యార్థి నాయకుడిగా ఉండగలడు. ఉండటం ఎంతైనా అవసరం అని అర్థమవుతుంది. నేను బలహీనుణ్ణి, అనర్హుణ్ని, ఎందుకూ పనికిరానివాడిని, నాకేమీ చేతకాదు, నేనేమీ చేయలేను అని నీవనుకొంటే నీలాంటివాళ్ళే దేవునికి కావాల్సింది.

నాలుకమాంద్యం గల మోషేను దేవుడు ఎన్నుకొని గొప్ప నాయకునిగా చేశాడు, పిరికివాడైన గిద్యోనును పిలుచుకొని పరాక్రమం గల బలాఢ్యుడిగా మార్చాడు, హింసకుడు, దూషకుడు, హానికరుడైన సౌలును దేవుడు పౌలుగా మార్చి గొప్ప నాయకుడిగా తీర్చి దిద్దారు. అతి చిన్నవయస్సులోనే జోసఫ్ అభిషేక్‌రావు (గోధుమ గింజ) గారిని పిలుచుకొని ఆంధ్రప్రదేశ్ అంతా సువార్త సాధనంగా వాడుకొన్నారు.

మరి నీవు ఎంత బలహీనుడవైనా కావచ్చు, ఎందుకూ పనికిరానివాడివైనా కావచ్చు. నీలో గొప్ప తలాంతులు లేకపోవచ్చు, కానీ దేవుడు నిన్ను రక్షించుకొన్నాడు, ఏర్పరచుకొన్నాడు, యుఇయస్ఐ (ఇయు) పరిచర్యలో పాలిభాగస్తునిగా చేసి, ఒక విశ్వాస విద్యార్థి నాయకునిగా ఉండే అవకాశాన్ని కల్పించారు.

ప్రియ తమ్ముడూ, చెల్లి, నిన్ను నమ్మి తన సేవా బాధ్యతను, అవకాశాన్ని దేవుడు నీకిచ్చాడు. ఆయన మన పట్ల కలిగియున్న కలలను నెరవేరుద్దామా? ఆ కలలను కాలరాద్దామా?


అబ్రహాము నా స్నేహితుడు, మోషే నా ఇల్లంతటిలో నమ్మకమైనవాడు, దావీదు నా హృదయానుసారుడు, భళా! నమ్మకమైన మంచి దాసుడా అని దేవుడు కొంతమంది నాయకులను బట్టి సంతోషించి, పిలుచుకోవడం జరిగింది. మరి నీవు, నేను ఎలా పిలిపించుకుందాం!

ఒకసారి ఆలోచిద్దామా! నాయకత్వాన్ని అంగీకరిద్దామా! ఆచరిద్దామా!, దేవుడిచ్చిన బాధ్యతను, పనిని నమ్మకంగా చేసి చూపిద్దామా!

**– ఎ. అనిల్ కుమార్, పద్మిని,** విస్సన్నపేట

కవిత

# నను మలచిన సిలువ



నీ సిలువ ప్రేమతో
నన్ను నీ బిడ్డగా మలిచావయ్యా
నా మదిలో నీ ప్రేమను
ఓ శిలగా నిలిపావయ్యా

నా ప్రతి పాపాన్ని నీ తనువుపై
ఒక్కొక్క గాయమై భరించావయ్యా
నా తండ్రివై నా కోసం
నీ ప్రాణాన్ని త్యాగం చేశావయ్యా

నాకు నీ జీవాన్నిచ్చి
ప్రాణం పోశావయ్యా
ఈ ప్రాణంతో నీ కోసం
నీ సాక్షిగా జీవిస్తానయ్యా

నీ ఊపిరితో నా తనువు
జీవించేటట్లు నడుచుకొంటానయ్యా
పగిలిపోయిన నా హృదయాన్ని
నీ సిలువ మరణంతో
తిరిగి ఒక కోవెలగా తీర్చిదిద్దావయ్యా

ఆ కోవెలలో నిన్నే నా ప్రాణ ప్రియుడుగా
ప్రతి తలంపుతో ఆరాధిస్తానయ్యా

**– లింగంగుంట సలోమి**
బీటెక్, పులివెందుల

# జీవితాన్ని ఘనంగా ముగించడం


## పరిచయం

ఒక పనిని ప్రారంభించి, దానిని పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేసే అలవాటు మనలో కొంతమందికి ఉంటుంది. ఉదాహరణకు, ఒక ఉత్తరం గాని లేదా ఒక మాసపత్రికకు ఒక వ్యాసం గాని రాయడానికి మొదలుపెడతాము. కానీ మధ్యలో ఆ ఆలోచన మానుకొని రాయడం ఆపేస్తాము. ఒక పుస్తకాన్ని చదవడం ప్రారంభిస్తాము, కొన్ని రోజుల తర్వాత విసుగొచ్చి ఆ పుస్తకాన్ని చదవడం ఆపేస్తాము. కొంతమంది ప్రేమించి పెళ్ళి చేసుకొంటారు గానీ ఆ నూతన ప్రేమానురాగాలు కొన్ని రోజుల తర్వాత ఆవిరైపోవడం మూలంగా, కుటుంబ జీవితంలో ఎదురయ్యే కష్టాలు, బాధ్యతలు లేదా మరొకరిని ప్రేమించడం మూలంగా, విడాకుల కోసం పరుగెత్తుతారు. ఒక కోర్స్ చదవడానికి ఒక కాలేజ్‌లో చేరతారు, ఆసక్తిని కోల్పోయి మధ్యలోనే ఆ కోర్స్‌ను ముగిస్తారు. ఇలాంటి ఉదాహరణలు ఎన్నో చెప్పుకోవచ్చు.

ఆయన శిష్యులలో అనేకులు ఈ మాట విని – ఇది కఠినమైన మాట. ఇది ఎవడు వినగలడని చెప్పుకొనిరి (యోహాను 6:60). ఇలా ఆయన శిష్యులలో అనేకమంది ఆయనను వెంబడించడం మానివేశారు. “నక్కలకు బొరియలును ఆకాశపక్షులకు నివాసములును కలవు గాని మనుష్యకుమారునికి తల వాల్చుకొనుటకైనను స్థలములేదని అతనితో చెప్పెను” (మత్తయి 8:20). ఆయన ఎక్కడికి వెళ్ళినా ఆయన వెంట వస్తానని చెప్పి ఆయనకు శిష్యునిగా మారాలని ఆశించిన ఒక వ్యక్తి, ఆయన చెప్పిన మాటలు విని, కనుమరుగైపోయాడు.

పౌలు దేమా గూర్చి ఇలా రాశాడు: “దేమా ఇహ లోకమును స్నేహించి నన్ను విడిచి థెస్సలొనీకకు వెళ్ళెను” (2 తిమోతి 4:10). ఒకప్పుడు తమతో ఉండి, ఇప్పుడు తనను విడిచివెళ్ళిన వారిని గూర్చి యోహాను ఇలా రాశాడు: “వారు మనలో నుండి బయలు వెళ్ళిరి గాని వారు మన సంబంధులు కారు; వారు మన సంబంధులైతే మనతో కూడా నిలిచియుందురు. అయితే వారందరు మన సంబంధులు కారని ప్రత్యక్షపరచబడునట్లు వారు బయలువెళ్ళిరి” (1 యోహాను 2:19). వారు ఘనంగా ముగించలేదు. వారు రోడ్డు మీద పడిన విత్తనాల వంటివారు.

ఇయు/ఇజియఫ్ సభ్యులముగా, నాయకులంగా దేవుని కొరకు చాలా ఆసక్తితో, తీవ్రతతో ఈ రోజు మనం ఉండొచ్చు. కానీ రానున్న రోజుల్లో మనం ఎలా ఉండబోతున్నాము? ఎలా ఉంటాము? మనం వెనుకకు జారిపోయి, చల్లారిపోయి, త్రోవ తప్పిపోతామా? లేదా, విశ్వాసం విషయంలో ఓడ బ్రద్దలైన వారి వలె ఉంటామా? (1 తిమోతి 1:19)? లేదా, మన



క్రైస్తవ జీవితం అనే పరుగు పందెమును, పరిచర్యను అపోస్తలుడైన పౌలు వలె ముగించుతామా? "మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నా కొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతి గల న్యాయాధిపతియైన ప్రభువు అది నీకును, నాకు మాత్రమే కాకుండా తన ప్రత్యక్షతను అపేక్షించు వారి కందరికిని అనుగ్రహించును" (2 తిమోతి 4:7-8).

మనము మన జీవితం చివర్లో ప్రభువువలె ఇలా చెప్పగలమా? "సమాప్తమైనది" (యోహాను 19:30) లేదా, ప్రభువువలె మనం ఇలా చెప్పగలమా? "చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణంగా నెరవేర్చి భూమి మీద నిన్ను మహిమపరచితిని" (యోహాను 17:4). మన పని విషయంలో అందరికన్నా ముందు ఉంటున్నామా? లేక వెనుకబడిపోయామా? సార్దీసులోని సంఘానికి మన ప్రభువు ఇలా చెప్పారు: "నీ క్రియలు, నా దేవుని యెదుట సంపూర్ణమైనవిగా నాకు కనబడలేదు గనుక జాగరూకుడవై, చావనైయున్న మిగిలిన వాటిని బలపరచుము" (ప్రక 3:2). మనం ఘనంగా ముగించకపోతే, ప్రభువు గద్దింపును మనం ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రభువునుండి మనం ఇలాంటి మాటలను వినకుండా ఉండాలంటే, మనము మేల్కోవాల్సిన అవసరత ఉంది.

వెల ఎంత చెల్లించాల్సి వచ్చినా సరే, మన ప్రభువు ఎంతో పట్టుదల, దృఢసంకల్పంతో పని చేశారు. ఆయన భయములేనివాడు, ధైర్యశాలి, కార్యదీక్షత కలిగి నవాడు. ఆయన ఎంతో భారంతో, ఆత్మవిశ్వాసంతో, రోషంతో పనిచేశాడు. "అయితే నేను పొందవలసిన బాప్తీస్మమున్నది. అది నెరవేరువరకు నేను ఎంతో ఇబ్బందిపడుచున్నాను" (లూకా 12:50). ఆయన యెరూషలేముకు వెళ్ళినప్పుడు ఆయనలోని పట్టుదల కనిపించింది. "వారు ప్రయాణమై యెరూషలేమునకు వెళ్ళుచుండిరి. యేసు వారికి ముందు నడుచుచుండగా వారు విస్మయమొందిరి. వెంబడించు వారు భయపడిరి" (మార్కు 10:32). తడబడుచూ కాకుండా, దృఢంగా నడుస్తూ ఆయన ముందుకు సాగిన విధానంలో అత్యవసరతను శిష్యులు గమనించారు.

ఇదే పట్టుదల, దృఢచిత్తం పౌలులో కూడా మనకు కనిపిస్తుంది. పౌలు ఇలా సమాధానం చెప్పాడు: పౌలు - ఇదెందుకు? మీరు ఏడ్చి నా గుండె బద్దలు చేసెదరేల? నేనైతే ప్రభువైన యేసు నామము నిమిత్తము యెరూషలేములో బంధింపబడుటకు మాత్రమేగాక చనిపోవుటకును సిద్ధముగా ఉన్నానని చెప్పెను. అతడు ఒప్పుకొననందున మేము - ప్రభువు చిత్తము జరుగును గాక అని ఊరకుంటిమి' (అ.కా. 21:13-14). స్నేహితులు గానీ, శత్రువులు గానీ ఎవరూ కూడా అతనిని ఆపలేకపోయారు.

గోపుర నిర్మాణకుని గూర్చి ప్రభువు ఒక ఉపమానాన్ని చెప్పారు: "మీలో ఎవడైననూ ఒక గోపురమును కట్టింపగోరిన యెడల దానిని కొనసాగించుటకు కావలసినది తన వద్ద ఉన్నదో లేదో అని కూర్చుండి తగులబడి మొదట లెక్కచూచుకొనడా? చూచుకొనని యెడల అతడు దాని పునాది వేసి, ఒకవేళ దానిని కొనసాగింపలేకపోయినందున చూచువారందరూ - ఈ మనుష్యుడు కట్ట మొదలుపెట్టెను గాని కొనసాగింపలేకపోయెనని అతని చూచి ఎగతాళి చేయసాగుదురు" (లూకా 14:28-30). మనం ఘనంగా ముగించకపోతే, ప్రజల నుండి ఎగతాళి, అవమానం ఎదుర్కోవాల్సి ఉంటుంది.

## మనం ఘనంగా ముగించలేకపోవడానికి కారణాలు ఏమిటి? మనల్ని ఆటంకపరచే విషయాలు ఏమిటి?

### 1. దర్శనం, భారం లేకపోవడం

మన చేతిలో ఉన్న పని పట్ల దర్శనం, భారం లేదు. ఫలితంగా, ఆ పనిని ముగించాలనే సమర్పణ లేదా పట్టుదల మనలో లేదు. కొలస్సీ 4:17లోని హెచ్చరికపై మనం శ్రద్ధ పెట్టాల్సిన అవసరత ఉన్నది. "మరియు - ప్రభువునందు నీకు అప్పగి ంపబడిన పరిచర్యను నెరవేర్చుటకు దాని గూర్చి జాగ్రత్తపడుమని అర్ఖిప్పుతో చెప్పుడి". దర్శనం, భారంలను మీకు ఇవ్వమని దేవునికి ప్రార్థన చేసుకోండి. దానికి సంబంధించిన పుస్తకాలు చదవండి. దర్శనం, భారం కలిగి పనిచేస్తున్న సహోదరీ, సహోదరులతో నీ సమస్యను చర్చించండి.

### 2. సోమరితనం, మందగొండితనం, ఇష్టం లేకపోవడం, వాయిదా వేయడం, నిర్లక్ష్యం

సోమరి ద్రాక్షతోట ఏమవుతుందో సామెతలు 24:30-34 వర్ణిస్తుంది: "సోమరివాని చేను నేను దాటి రాగా తెలివిలేని వాని ద్రాక్షతోట నేను దాటి రాగా, ఇదిగో దానియందంతట ముండ్ల




తుప్పలు బలిసియుండెను. దూలగొండ్లు దాని కప్పియుండెను. దాని రాతి గోడ పడియుండెను. నేను దాని చూచి యోచన చేసుకొంటిని. దాని కనిపెట్టి బుద్ధి తెచ్చుకొంటిని. ఇంక కొంచెము నిద్ర యింక కొంచెము కునుకుపాటు, పరుండుటకై యింక కొంచెము చేతులు ముడుచుకొనుట, వీటి వలన నీకు దరిద్రత పరుగెత్తి వచ్చును. ఆయుధస్థుడు వచ్చినట్లు లేమి నీ మీదికి వచ్చును".

### 3. మరికొన్ని విషయాలు

పాపంలో జీవించడం, గర్వం, అహంకారం, అసూయ, ద్వేషం, పగ, వైరము, ఓర్వలేనితనం, తెగిపోయిన సంబంధాలు, అక్రమసంబంధాలు, శ్రద్ధ లేకపోవడం, ఆధ్యాత్మిక ఎదుగుదల లేకపోవడం, అపరిపక్వత, అవిశ్వాసితో వివాహం, దర్శనం, భారం, నిబద్ధత, సమర్పణ లేకపోవడం, మొ॥నవి. ఈ చిట్టాకు ఇంకా చాలా విషయాలు చేర్చవచ్చు.

## జీవితాన్ని ఘనంగా ముగించడానికి నాలుగు ఆత్మీయ సూత్రాలు

### 1. శక్తిలోపం లేకుండా చేయడం

చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనినైనను నీ శక్తి లోపము లేకుండా చేయుము" (ప్రసంగి 9:10). నీ వృత్తికి సంబంధించిన బాధ్యతలపై శ్రద్ధ పెట్టు. నీ బాధ్యతలను శ్రద్ధగా నిర్వహించు. కాలనిర్ణయ పట్టికకు కట్టుబడి ఉండు. ఏ రోజు చేయవలసిన పనిని ఆ రోజే పూర్తి చేయి (నిర్గమ 5:18).

### 2. దేవుని మహిమకొరకు చేయడం

"కాబట్టి మీరు భోజనము చేసినను పానము చేసినను మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమకొరకు చేయుడి (1 కొరింథీ 10:31). మనం ఏ పని చేసినా, దాని ఉద్దేశం దేవునికి మహిమ తీసుకురావాలన్నదే అయిఉండాలి. మన సొంత కీర్తి, ప్రతిష్టల కోసం మనం ఏ పని చేయకూడదు. మన బ్యాంక్ బ్యాలెన్స్ నింపుకోవడానికో, మన సొంత సామ్రాజ్యాన్ని కట్టుకోవడానికో మనం పని చేయకూడదు. రెండు కళ్ళ సిద్ధాంతం లేదా మెల్లకన్ను విధానం - అంటే, ఒక కన్ను భారతదేశం మీద, మరొక కన్ను పాశ్చాత్య దేశాల మీద ఉండకూడదు.

### 3. సమస్తం ఆయన పేరట చేయాలి

"మరియు మాటచేత గాని, క్రియచేత గానీ మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17). మనం ఏమి మాట్లాడినా లేదా చేసినా, అది ప్రభువైన యేసుక్రీస్తును బట్టి, ఆయన నామములో దేవుని మహిమకోసం మనం మాట్లాడాలి లేదా చేయాలి.

### 4. మనస్ఫూర్తిగా చేయాలి

"... మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము గాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి (కొలస్స 3:23). మనం యుఇయస్ఐ-ఏపిలో ఉన్నా లేక మరొక చోట ఉన్నా, మనం ఏ వ్యక్తి కోసం గాని, లేదా వ్యక్తులు స్థాపించిన సంస్థల కోసం గాని పని చేయడం లేదు, సేవించడం లేదు. మనం ప్రభువును సేవిస్తున్నాము, ఆయన కోసం పనిచేస్తున్నాము. మనకు బహుమానం ఆయన దగ్గర నుండి వస్తుంది. కాబట్టి, శక్తి వంచన లేకుండా మనం పని చేద్దాం.

ఈ విధంగా చేయడం ద్వారా ఆధ్యాత్మికతలోనికి, క్రీస్తు సారూప్యతలోనికి మనం ఎదుగుతాం. ఎంతో ఉపయోగకరమైన వ్యక్తులంగా ఎదుగుతాం, అంత్యదినమున మన ప్రభువు నోటినుండి మనం ఈ మాటలు వింటాం: "భళా, నమ్మకమైన మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైన వాటి మీద నియమించెదను. నీ యజమాని సంతోషములో పాలుపొందుమని అతనితో చెప్పెను" (మత్తయి 25:21). మన జీవితాన్ని ఘనంగా ముగించుటకు శక్తివంచనలేకుండా, మనస్ఫూర్తిగా ప్రయాసపడుదాం.

**- రెవ. రిచర్డ్ మసీ,** న్యూఢిల్లీ

**అనువాదం: పి. రామస్వామి, దర్శి**

# గొప్ప నాయకులు
## తప్పులెందుకు చేస్తారు?



ఉన్నత ఉద్దేశాలతో నాయకత్వ ప్రయాణాన్ని ప్రారంభించిన ఎంతోమంది నాయకులు కోరుకొన్న గమ్యాన్ని చేరుకోకముందే తమ నాయకత్వ ప్రభావాన్ని కోల్పోతుంటారు. చేతులారా తాము చేసుకొన్న తప్పుల కారణంగా ఒకప్పటి గొప్పనాయకులు నాయకత్వ వేదిక నుంచి అర్థాంతరంగా దిగిపోయారు. ఇటీవల "సెంటర్ ఫర్ క్రియేటివ్ లీడర్‌షిప్" నిర్వహించిన అధ్యయనంలో దాదాపు 40% మంది నాయకులు తమను నియమించిన సంస్థల అంచనాలను అందుకోవడంలో విఫలమౌతున్నట్టు తేలింది.

అసలు గొప్పనాయకులు తప్పులెందుకు చేస్తారు? కొత్తతరం నాయకులు అలాంటి తప్పులు దొర్లకుండా ఎలా జాగ్రత్తపడాలి? ఇశ్రాయేలు దేశానికి మొదటి రాజైన సౌలు జీవితాన్ని నిశితంగా పరిశీలించి ఈ ప్రశ్నలకు సమాధానం కనుక్కొనే ప్రయత్నమే ఈ వ్యాసం. సౌలు నాయకత్వ వైఫల్యానికి దారితీసిన కారణాలు, వాటి ద్వారా మనం నేర్చుకోగలిగిన పాఠాలు ఏమిటో చదవండి.

### 1. పెంచి పోషించకపోతే గొప్ప లక్షణాలు క్రమంగా అదృశ్యమవుతాయి

సౌలు రాజుగా తన కెరీర్‌ను ప్రారంభించిన తొలిరోజుల్లో అతనిలో ఎన్నో గొప్ప లక్షణాలు ఉండేవి. అతను తండ్రి మాటను శిరసావహించి గాడిదల అన్వేషణకు బయలుదేరిన బాధ్యతగల కుమారుడు[1]. గౌరవసూచకమైన బహుమతి లేకుండా ప్రవక్త దగ్గరకు వెళ్ళడానికి నిరాకరించిన భక్తిపరుడు[2]. దేవుని నుంచి కొత్త హృదయాన్ని పొందిన భాగ్యవంతుడు[3]. గిట్టనివాళ్ళ ఘాటు విమర్శలను పెడచెవినబెట్టిన ఉదాత్తుడు[4]. తన ప్రజల కోసం మీసం మెలేసి శత్రువులతో పోరాడి గెలిచిన ధీమంతుడు[5]. దేవుని దయను, అనుగ్రహాన్ని పొందిన అభిషిక్తుడు[6]. కానీ తనలోని ఇన్ని గొప్ప



**ప**రిస్థితుల ఒత్తిళ్ళు, దేవుని వాక్య విలువల మధ్య నాయకుడు దేనికి తలవంచుతాడనేదే నాయకత్వానికి అసలైన పరీక్ష.

లక్షణాలను అతడు పెంచి పోషించుకోలేకపోయాడు. అందుకే నాయకునిగా దేవుని ప్రమాణాలను అందుకోలేకపోయాడు.

ఎడ్వర్డ్ మర్ఫీ అనే విజ్ఞానవేత్త ప్రతిపాదించిన నియమం ప్రకారం "చెడిపోగలిగే ప్రతీది చెడిపోతుంది". మనవైపు నుంచి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోతే అదే జరుగుతుంది. థర్మోడైనమిక్స్ రెండో నియమం కూడా అదే చెబుతుంది. "ఎలాంటి మానవ ప్రమేయం లేనప్పుడు, సహజంగా జరిగే సంఘటనలు, ఒక వ్యవస్థను క్రమంగా మరింత క్రమరాహిత్యానికి నడిపిస్తాయి".

నాయకులు దేవుడు తమకిచ్చిన సామర్థ్యాలనూ, నైపుణ్యాలనూ, మంచి లక్షణాలను గుర్తించి, మెరుగుపర్చుకోవాలి. వ్యక్తిగత అభివృద్ధి కోసం సమయం కేటాయించాలి. నాయకుడు ఎదగడం లేదంటే దిగజారుతున్నాడనే అర్థం. ముందుకెళ్ళడం లేదంటే వెనుకబడి పోతున్నాడనే అర్థం. అందుకే నాయకులు తమను తాము సమున్నత వ్యక్తులుగా మలచుకొనే పనిలో నిరంతరం నిమగ్నమైయుండాలి. అలా జరగనప్పుడు నాయకుడు ప్రవహించని నీరులా ఒక స్తబ్దమైన స్థితికి చేరుకొంటాడు. కాలక్రమేణా ప్రభావాన్ని కోల్పోతాడు.

### 2. ఒక పని తప్పుకాకపోయినంత మాత్రాన ఒప్పు కాదు

యుద్ధానికెళ్ళేముందు యెహోవాకు బలి అర్పించడం సౌలుకు తప్పుగా తోచలేదు. ఒక పక్క శత్రువులు ఉప్పెనలా ముంచెత్తబోతున్నారు, మరోప్రక్క తన సైన్యంలో అసహనం పెరిగిపోతోంది. ఆలోచించడానికి సమయం లేదు. వెంటనే అర్పణ ముగించి యుద్ధభేరి మోగించకపోతే సర్వనాశనం అయిపోతుంది. సమూయేలు ప్రశ్నించినప్పుడు సౌలు ఇచ్చిన సమాధానం ఇదే[7]. ఏ కోణంలో నుండి చూసినా సౌలు చేసింది ఒప్పే, ఒక్క దేవుని కోణంలో నుండి తప్పు. దేవుని దృష్టిలో అది ఆజ్ఞను అతిక్రమించడం, అవివేకంగా ప్రవర్తించడం[8].

పరిస్థితుల దృష్ట్యా సమంజసంగా కనిపించేవి దేవుని దృష్టికి ఆమోదయోగ్యమైనవి కాకపోవచ్చు. నాయకులు ఈ విషయాన్ని గ్రహించాలి. పరిస్థితుల ఒత్తిళ్ళకి, దేవుని వాక్య విలువలకు మధ్య నాయకుడు దేనికి తలవంచుతాడనేదే నాయకత్వానికి అసలైన పరీక్ష. తప్పొప్పుల తక్కెడలో తికమకపడే పరిస్థితిని అధిగమించడం నాయకుని ముందున్న పెద్ద సవాలు. నాయకులు తమకంటూ నిర్ణయించుకొన్న నైతిక విలువల పునాదుల మీద తమ నాయకత్వ శైలినీ, ప్రవర్తననూ నిర్మించుకున్నప్పుడు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. సౌలులా తమను తాము సమర్థించుకోవాల్సిన ఆత్మసంరక్షణ పరిస్థితి ఎదురవ్వకుండా కాపాడుకోగలుగుతారు[9].

కొన్నిసార్లు నాయకులు కార్యసాధనే లక్ష్యంగా పెట్టుకొని, సాధించే పద్ధతుల విషయంలో రాజీ ధోరణిని అనుసరిస్తారు. అలాంటి ధోరణి వల్ల మంచి నాయకులు కూడా తప్పు దారి తొక్కే ప్రమాదం ఉంది. ఇదే విషయాన్ని ధృవీకరిస్తూ మార్క్ సాన్‌బార్న్ ఇలా చెప్పాడు, "ఫలితాలను సాధించే మార్గాలకంటే అవి సాధించడమే ముఖ్యంగా భావించినపుడు, నాయకుని అడుగులు వైఫల్యం వైపు పడినట్టే".

### 3. తప్పును అనుమతించడం తప్పు చెయ్యడంతో సమానం

నాయకులు తాము తప్పు చెయ్యకుండా ఉండటమే కాకుండా తమ పరిధిలో తప్పు జరగకుండా చూసుకునే బాధ్యత కూడా వహించాలి. దేవుడిచ్చిన ఆజ్ఞ ప్రకారం అమాలేకీయుల రాజును, శ్రేష్టమైన కొన్ని జంతువులను ఎందుకు చంపలేదని సమూయేలు ప్రశ్నించినప్పుడు, సౌలు ఆ తప్పును ప్రజలు చేసిన తప్పుగా వర్ణించి, తాను తప్పుకొనే ప్రయత్నం చేశాడు. తన అధీనంలో ఉన్న ప్రజలు తన ఇష్టానికి వ్యతిరేకంగా తప్పు చేస్తున్నప్పుడు సౌలు దాన్ని అడ్డుకోలేకపోయాడు. తప్పును అనుమతించడం ద్వారా తాను కూడా తప్పు చేశాడు. ప్రజలకు భయపడి వారికి తలవంచానని ఒప్పుకొన్నాడు. ప్రజలను ప్రభావితం చెయ్యాల్సిన నాయకుడు వారికి భయపడాల్సి రావడం ఆశ్చర్యం

**నాయకుడు తయారు చెయ్యాల్సింది అనుచరుల్ని కాదు, నాయకుల్నే అన్న విషయం ప్రతి నాయకుడూ గుర్తించాలి.**



కలిగించే విషయం[10]. తన కుటుంబంలోగానీ, తన జట్టులోగానీ తప్పు జరుగుతున్నప్పుడు మంచి నాయకుడు చూస్తూ ఊరుకోడు. నాయకుడు తాను చేసిన దానికే కాదు, చెయ్యనిదానికి కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

తప్పు జరిగినప్పుడు కేవలం ఇతరులను నిందించడం మంచి నాయకుల లక్షణం కాదు. నిజమైన నాయకులు ప్రజలనూ, పరిస్థితులనూ, వ్యవస్థనూ నిందిస్తూ కూర్చోరు. సాకులు చూపే అల వాటున్నవారు ఎప్పటికీ నాయకులు కాలేరు. బాధ్యత వహించగలిగిన వాళ్ళే నాయకులు. తన చుట్టూ ఉన్న వ్యవస్థలో లోపమున్నప్పుడు, అందులో తన బాధ్యత కూడా ఉందని గుర్తించేవాడే అసలైన నాయకుడు.

ఒక సమస్యకు పరిష్కారం కావాలనుకొన్నప్పుడు, దానికి సంబంధించిన బాధ్యతను తీసుకోవడం, మనం చెయ్యగలిగింది చెయ్యడమే ఉత్తమమైన మార్గం. అది తప్ప వేరే మార్గమేదైనా సమస్యను జటిలం చేస్తుందే తప్ప పరిష్కరించలేదు.

కుటుంబ నాయకులుగా తల్లిదండ్రులు తమ పిల్లలు తప్పుదోవలో నడుస్తున్నప్పుడు చూసీ చూడనట్టు ఉండటం ప్రమాదకరం. ఏలీ అనే యాజకుడు తన కుమారులు చేసే చెడ్డపనులను ఆపలేకపోవడం వల్ల కుటుంబమంతా నాశనమైపోవడం మనకు తెలియని విషయం కాదు[11].

### 4. జట్టు సభ్యుల గొప్పతనం నాయకునికి ప్రమాదం కాదు

కొంతమంది నాయకులు తమ జట్టులో నాయకత్వ లక్షణాలు కలిగిన సభ్యులు తమకు ప్రమాదంగా పరిణమిస్తారనే అభిప్రాయంతో వారి ని అణచివేసే ప్రయత్నం చేస్తుంటారు. గొల్యాతు సంఘటన తర్వాత దావీదు ఒక గొప్ప నాయకుడిగా ఆవిర్భవించాడు. దావీదులోని సామర్థ్యాన్ని సరైన విధంగా ఉపయోగించుకోవడానికి బదులు సౌలు అతన్ని చంపాలని ప్రయత్నించాడు[12]. దావీదు జీవితంలో నెరవేరుతున్న దేవుని ప్రణాళికను సౌలు గ్రహించి, ప్రోత్సహించలేకపోయాడు. తన జట్టులో దేవుని ప్రణాళికను నెరవేర్చగల యోధుల్ని, కాబోయే రాజుల్ని తయారుచేయగలిగేవాడే నిజమైన నాయకుడు.

నాయకుడు తన జీవితంలో తాను దేవుని ప్రణాళికను నెరవేర్చడమే కాకుండా ఇతరుల్లో కూడా ఆ పని జరిగేలా ప్రోత్సహించాలి. కొంతమంది నాయకులు అలా చెయ్యలేకపోవడానికి కారణం వారిలోని అభద్రతా భావమే. తమలోని గొప్పతనాన్ని గుర్తించలేని నాయకులు ఇతరుల గొప్పతనాన్ని చూసి అసూయపడతారు. నిజమైన నాయకులు తమ జట్టులోని గొప్పతనాన్నీ, జట్టు సభ్యుల విజయాన్నీ సంతోషంగా స్వీకరిస్తారు. తమకంటే గొప్ప జట్టును వాళ్ళు తయారుచేస్తారు. రెండోతరం నాయకుల ను తయారుచెయ్యలేకపోవడం ప్రస్తుత నాయకుల ప్రధాన లోపం. ఒక గొప్ప నాయకుని ఆధ్వర్యంలో అభివృద్ధి శిఖరాలను అధిరోహించిన సంస్థలూ, సంఘాలూ ఆ నాయకుని తర్వాత అకస్మాత్తుగా కుప్పకూలిపోవడానికి కారణం ఇదే. నిజమైన నాయకులు అంతా తమ మీదే ఆధారపడేలా చేసుకోరు. తాము లేనప్పుడు కూడా సంస్థలూ, సంఘాలూ సజావుగా నడిచేలా సిద్ధం చేస్తారు.

అలెగ్జాండర్ లాంటి గొప్ప నాయకుడు కూడా, తన తర్వాత రాజ్యాన్ని పరిపాలించే నాయకుణ్ణి తయారుచెయ్యలేకపోయాడంటే ఆశ్చర్యం కలు గకమానదు. జాక్‌వెల్ఛ్ చెప్పినట్టు "నాయకుడివి కాకముందు విజయమంటే నువ్వు ఎదగడమే, నాయకుడివి అయ్యాక విజయమంటే ఇతరులు ఎదిగేలా చెయ్యడమే". నాయకుడు తయారు చెయ్యాల్సింది అనుచరుల్ని కాదు, నాయకుల్నే అన్న విషయం ప్రతి నాయకుడూ గుర్తించాలి. తన జట్టులోని సామర్థ్యాలను వెలికితీసి, సానబట్టి తనకంటే గొప్ప నాయకులను తయారుచెయ్యాలి.

### 5. తప్పు మార్గంలో ముందుకెళ్ళేకొద్దీ వెనక్కి రావడం కష్టం.

సౌలు చివరకు ఒక భయంకరమైన పరిస్థితికి

చేరుకొన్నాడు. తాను దేశం నుంచి వెళ్ళగొట్టిన మాంత్రికులను తానే వెతుక్కుంటూ బయలుదేరాడు. దేవుడు తన ప్రార్ధన వినడం మానేశాడు[13]. బహుశా ఒక నాయకుని జీవితంలో అత్యంత దయనీయమైన స్థితి ఏంటంటే అతడు దేవుని మాటలు వినలేని పరిస్థితి. తమ దేవునితో సన్నిహిత సంబంధం లేని నాయకులు సమాజానికి ప్రమాదకరంగా పరిణమించగలరు.

సౌలు ఒక్కో అడుగూ దేవునికీ, దేవుని ప్రణాళికలకూ దూరమవుతూ వెళ్ళాడు. వెనక్కి రాలేనంత కష్టమైన పరిస్థితి అతనికి దాపురించింది. కొంతమంది నాయకులు ఒకదాని తర్వాత మరో తప్పు చేస్తూ దేవుని స్వరం విని సరిదిద్దుకొనే పరిస్థితిని దూరం చేసుకొంటారు. జీవితంలో పాతుకుపోయిన అలవాట్ల నుండి, జీవితంలో భాగంగా మారిపోయిన స్వభావం నుండి బయటపడటం అత్యంత కష్టంగా మారిపోతుంది. కొన్నిసార్లు కఠినమైన మనసుతో పర్యవసానాలకు కూడా సిద్ధపడిపోయే ధోరణి ప్రదర్శిస్తారు.

ప్రమాదమని తెలిసి కూడా పులిమీద సవారీ చెయ్యడం మొదలుపెట్టిన వ్యక్తి కొంతకాలం తర్వాత పులిబారిన పడకుండా దిగి పారిపోలేడు, అలాగని కొనసాగనూ లేడు. అలాంటి పరిస్థితి రాకుండా ప్రతి నాయకుడూ జాగ్రత్తపడాలి.

ఒక మంచి నాయకునిగా ప్రయాణాన్ని మొదలు పెట్టిన సౌలు తన జీవితంలో చేసిన తప్పులూ, ఫలితంగా ఎదుర్కొన్న పరిస్థితులూ ప్రస్తుత నాయకులకు బలమైన పాఠాలు.

**- డా. ప్రసాద్ తాళ్ళూరి**

1) 1సమూ9:3 2) 1సమూ 9:7 3) 1సమూ 10:9 4) 1సమూ 10:27 5) 1సమూ 11:11 6) 1సమూ 11:13 7) 1సమూ 13:11 8) 1సమూ 13:13 9)1సమూ 15:21 10) 1సమూ 15:24 11) 1సమూ 2:29 12) 1సమూ 18:8 13) 1సమూ 28:6.

# Crossword Puzzle

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | | | 3 | | | 4 |
| 5 | | ■ | ■ | ■ | | ■ | ■ | |
| | | 6 | | | | | | |
| | | ■ | 7 | | | | | ■ |
| | 8 | | | | | | | |
| 9 | | | | | | | | |
| | 10 | | | | | | | |

**Horizontal**

1. UESI study centre in Nilagiri Dist.of TN
6. Every Graduate must play a role in EU
7. Founder of UESI, the Student Movement
8. The Back bone of EU/ICEU Ministry
9. The place where there is no EU witness
10. The family available for Student's ministry

**Vertical**

2. The student ministry across the boarder
3. UESI Newsletter for private circulation
4. The department conducts state CMTC
5. State level study centre of UESI-AP




*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

**Last month key:**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| J | E | R | O | H | A | M |
| N | Z | I | P | H | | O |
| A | | | H | | B | R |
| A | Z | U | R | G | A | D |
| M | I | C | A | A | A | E |
| A | | | H | I | N | C |
| N | | | | U | A | A |
| | N | I | M | S | H | I |

1. *M. Ankarao, Guntur*
2. *T. Anand Babu & Koteswari, Chilakaluripet*
3. *T. Anna Mani, Gudiwada*



# నిజ నాయకుడు

చర్చ్ ప్రాంగణమంతా కోలాహలంగా ఉంది. ఆ రోజు చర్చిని సందర్శించే ఎమ్మెల్యే గారి రాకను తెలియజేస్తూ పెద్దపెద్ద బ్యానర్లు గేటుకు వేలాడుతున్నాయి. సంఘంలోని సభ్యులందరికీ పనులు పురమాయిస్తూ పాస్టర్ గారు హడావిడిగా లోపలికీ బయటికీ తిరుగుతున్నారు. పిల్లా జెల్లా, ముసలీ ముతకా ఎవరికి తోచిన పని వాళ్లు చేస్తూ పాస్టర్‌గారి దృష్టిలో పడడానికి తాపత్రయ పడుతున్నారు. "ఏమో అనుకున్నాం గానీ అయ్య గారికి చాలా పరపతి ఉంది" "ఏమనుకున్నావ్ మరి.. అయ్యగారు వాక్యం చెప్తే దేవుడే దిగొచ్చి వింటాడు. అంత బాగా చెప్తారు". పనులు చేస్తూ ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడుకోసాగారు.

ఇంతలో లోపలినుంచి బయటికి వచ్చిన పాస్టర్ బెంజిమన్ "ఒరేయ్ యేసేపూ! ఆ బ్యానర్ ఒక పక్కకి వంగినట్లుగా ఉంది.. సరిచెయ్. ఇదిగో యాకోబూ! అడ్డంగా ఉన్న ఆ బకెట్లు తీసి ఒక పక్కకి పెట్టు. ఇదిగో ఆడవాళ్లంతా ఇక్కడే ఉంటే వంటల సంగతి ఎవరు చూస్తారు. సువార్తమ్మా, మార్తమ్మా.. మీరిద్దరూ వంటల దగ్గరకు వెళ్లండి.." అంటూ అటూ ఇటూ తిరగసాగాడు.

తుఫాను వచ్చినట్లుగా గేటు ముందంతా హడావిడి మొదలైంది. చర్చ్ గేట్ చుట్టూ నిల్చున్న వాళ్లల్లో ఉత్సాహం ఎక్కువైంది. 'పేద ప్రజల పాలిట దేవుడు మన ఎమ్మెల్యే గారికి జై','ఎమ్మెల్యే గారికి జై'అనే నినాదాలతో ఆ ప్రాంతమంతా రణరంగంగా మారి పోయింది. ఇద్దరు గన్‌మ్యాన్‌లు వెంటరాగా ఎమ్మెల్యే గారు ఠీవీగా చర్చ్ లోపలికి ప్రవేశించి తనకు కేటాయించిన సీట్‌లో కూర్చున్నారు. వేదికనెక్కిన పాస్టర్ గారు ఎమ్మెల్యే గారి గొప్పతనం గురించి, వాళ్ల అనుచరుల గురించి, ఎన్నో మంచి పనులు చేస్తూ, అందరికీ ఆదర్శంగా నిలుస్తూ ఆయన ప్రజలకు చేస్తున్న మంచిపనుల గూర్చి చెప్తూ మధ్య మధ్యలో ఎమ్మెల్యేగారు వింటున్నారో లేదోనని ఆయన వంక చూస్తున్నాడు.

కాసేపటి తర్వాత ఎమ్మెల్యే గారు ప్రసంగించారు. నియోజకవర్గ సమస్యల గూర్చి, పార్టీ అధినేత నాయకత్వ లక్షణాల గూర్చి, ప్రజలకు అందిస్తున్న పథకాల గురించీ చెప్తూ 'ఎలాగైనా మళ్లీ మమ్మల్ని అధికారంలోకి తెస్తే మీకు మరిన్ని ప్రయోజనాలు కలిగిస్తామని' హామీ ఇచ్చారు. ఏదో అర్జెంట్ ఫోన్ రావడంతో అందరి దగ్గర సెలవు తీసుకుని అధికార దర్పంతో అక్కడినుంచి కదిలాడు.

ఆయన వెళ్లాక సంఘస్థులందరూ పాస్టర్ గారి దగ్గరకు వెళ్ళి ఆయన చేసిన ఘనకార్యాన్ని, పాస్టర్ గారికున్న పరిచయాలను పొగడసాగారు. ఒకరు భోజనం ప్లేట్ పట్టుకుని నిల్చుంటే, ఇంకొకరు చెయ్యి కడుక్కోవడానికి నీళ్ళ పాత్ర పట్టుకొని సిద్ధంగా ఉన్నారు. వాళ్లందరి వంకా చిద్విలాసంగా చూస్తూ భోజనం చేయడానికి సిద్ధమయ్యాడు పాస్టర్ బెంజిమన్.

అప్పటివరకూ వెనకబెంచీలో కూర్చుని ఇదంతా చూస్తున్న విల్సన్‌కి చాలా ఇబ్బందిగా అనిపించింది. ఎన్నో ఏళ్ళనుంచీ విల్సన్ ఆ చర్చ్‌కి వస్తున్నాడు. చాపకింద నీరులా రాజకీయాలు చర్చ్‌లోకి ప్రవేశించడాన్ని, దేవుడి కంటే రాజకీయ నాయకుల గుణ లక్షణాలనే ఎక్కువగా పొగడడానికి ఆసక్తి ప్రదర్శి ంచడాన్ని, లోక నాయకత్వాన్నే గొప్ప నాయకత్వంగా ప్రచారంలోకి తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాన్ని గమనిస్తూనే ఉన్నాడు.

విల్సన్ కుర్చీలోనుంచి లేచి బయటికి నడిచాడు. ఆరడుగుల ఎమ్మెల్యే భారీ కటౌట్ అతని కళ్లముందు నిలిచింది. మనసంతా దిగులుగా అయిపోయింది. ఆలోచిస్తున్న కొద్దీ అతన్ని ఏదో తెలియని బాధ వెంటాడసాగింది. 'గొప్ప నాయకత్వమంటే.. నలుగుర్ని వెంటేసుకుని తిరగడమా? నలభై మంది మీద అజమాయిషీ చెలాయించడమా? నాయకుడంటే.. కుల, మత, ప్రాంత, వర్గాల ఆధారంగా ఏర్పాటు

చేసిన గుంపును ముందుకు నడిపేవాడా?' ఏమో.. లోకంలో ఎన్నో గుంపులున్నాయి. వాటిని నడపడానికి ఎంతోమంది నాయకులున్నారు. వాళ్లు తమ తమ హావభావాలను బట్టో, వేషభాషల్ని బట్టో ప్రజలకు మాదిరికరంగా ఉన్నట్లు నటిస్తుంటారు. ప్రజలకు దగ్గరవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ప్రజల్ని ప్రేమిస్తున్నట్లుగా, ప్రజల కోసమే తమ జీవితాల్ని ఫణంగా పెడుతున్నట్లు మభ్యపెడుతుంటారు. కానీరోజులు గడిచేకొద్దీ ఆయా నాయకుల నిజస్వరూపం వారి పనుల ద్వారా, మాటల ద్వారా, వారి వ్యక్తిత్వం ద్వారా బయటపడుతుంటుంది.

భూమి పుట్టినప్పటి నుండి ఎంతోమంది నాయకులు ఆయా ప్రాంతాలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల యొక్క, ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నుకోబడిన దేశ అధినాయకత్వాన్ని తమ కనుసన్నల్లో నుంచి శాసించారు. తాము పెట్టిందే శాసనం, రాసిందే రాజ్యాంగం అన్నట్లుగా ప్రజల్ని తమ అదుపులో ఉంచుకున్నారు. కానీ వాళ్లంతా ఈ లోకపరంగా ఎన్నిక కాబడ్డ నాయకులు! వారు పదవిలోకి వచ్చేవరకు ప్రజలకు విధేయులుగా ఉంటారు. పీఠం మీద కూర్చున్నాక తమ అవసరాలకు, సౌకర్యాలకు ప్రాముఖ్యత నిస్తారు.

బహుశా.. ఇప్పటివరకూ చరిత్రలో ప్రజల కోసం తమ సౌకర్యాలను వదులుకున్న నాయకులు, ప్రజల్ని ఆత్మీయంగా బలపర్చే నాయకులు, మనిషిని ప్రేమించి, మనిషి అవసరాలను గుర్తించి, వారిని తనతో సమానమైన స్థానానికి తీసుకెళ్లడానికి తపన పడిన నాయకులను ఈ లోకంలో కొంతమందిని గుర్తించుకుంటాం. వీరందరి కంటే సమస్త మానవాళి పాపాల కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా సిలువలో అర్పించిన ప్రభువైన యేసుక్రీస్తు గొప్ప నాయకుడు. ఆయనలాంటి నాయకుడు ఈ లోకంలో మనకెప్పుడూ కనిపించరు. పరలోకాన్ని వదులుకొని పాపుల కోసం పశువుల పాకలో జన్మించి లోకాన్ని చీకటి నుంచి వెలుగులోకి నడిపించాలని తపన పడిన యేసుక్రీస్తు నిజమైన ఆత్మీయ నాయకుడు. విల్సన్‌కి బైబిల్లోని వాక్యాలు గుర్తొచ్చాయి.

"మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీ పరిచారకుడై ఉండవలెను. మీలో ఎవడు



ముఖ్యుడై యుండగోరునో వాడు మీ దాసుడై యుండవలెను. అలాగే మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గానీ పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకు వచ్చెను" (మత్తయి 20: 25–28).

మనందరికీ వాక్యం తెలుసని, వాక్యానికి లోబడి జీవిస్తున్నామని, దేవునికి విధేయులుగా ఉంటున్నామనే భ్రమలోనే బతికేస్తున్నాం. మనం ముఖ్యులుగా ఉండడానికే ఇష్టపడతాము గానీ క్రీస్తులా దాసులుగా ఉండడానికి మన మనసు అంగీకరించదు. పరిచర్య చేయించుకోవడానికే మొగ్గు చూపిస్తాం గానీ క్రీస్తులా పరిచర్య చేయడానికి ఎంతో ఆలోచిస్తాం. మనలో దీనత్వం లేదు. పరిచర్య చేసే తీరిక లేదు. ఇతరుల క్షేమం కోసం మనల్ని మనం అర్పించుకొనే త్యాగ లక్షణం లేదు. చిన్న పదవి ఉన్నా లోకమంతా మనల్ని గుర్తించాలని కోరుకుంటాం. నాయకత్వమంటే పదవినో, అధికారాన్నో చూస్తాము తప్ప యథార్థంగా, నమ్మకంగా పనిచేయాలనే ఆలోచన ఉండదు. కానీ క్రీస్తు కూడా ఇలా ఆలోచిస్తే మన పరిస్థితి ఎలా ఉండేది? విల్సన్ ఒక్క క్షణం కళ్ళు మూసుకొని ఇలా ప్రార్థించాడు.

"ప్రభువా! లోక నాయకత్వాన్ని తప్ప ఆత్మీయ నాయకత్వాన్ని గుర్తించలేని గుడ్డితనంలో మేమున్నాం. నిన్ను వెంబడిస్తున్నామని పెదవులతో చెప్తున్నాం కానీ మనసు మాత్రం నీకు దూరంగానే ఉంది. నిన్ను ఆత్మీయ నాయకునిగా, నిజ నాయకునిగా గుర్తించి వెంబడించే కృపను దయచేయి. నశించిపోతున్న ఎంతోమందిని వెదకి రక్షించి నీలోకి నడిపించే పనిలో మాకు సమర్థత అనుగ్రహించు. పరిచర్య చేయడంలో నిన్ను అనుకరించడం నేర్పించు.."

**– డా. జడా సుబ్బారావు**, నూజివీడు

# కోశాధికారి లేఖ

## మాదిరి కలిగి ఉందాం!

క్రీస్తునందు అతి ప్రియమైన యుఇయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామంలో శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

"కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంట కోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును"

- 2 కొరింథీ 9:6

విద్యార్థుల మధ్య పరిచర్యలో పాలిభాగస్తులమైన మనం వాక్యమనే విత్తనాన్ని సమృద్ధిగా విత్తటం వలన సమృద్ధిగా పంటను కోస్తాం. సమృద్ధిలో కొన్నిసార్లు మనం మోయలేనంత, దాయలేనంత ఎక్కువగా దేవుడు మనకు ఇస్తాడు. మన పితరులైన ప్రొ. ఇనాక్‌గారు, డా. టి.యన్. స్టెరెట్ గారు మనకు ఇవ్వడంలో, ప్రభువు పనిలో, ప్రకటించడంలో, ప్రయాసలో ఎంతో మాదిరిగా ఉన్నారు. వారిని జ్ఞాపకం చేసుకొంటూ రెట్టింపు ఉత్సాహంతో కొనసాగుదాం. మన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ కూడా ప్రార్థనలోనూ, ప్రయాసడుటలోనూ, ఆర్థిక సంబంధమైన విషయాల్లోనూ విశేషమైన చొరవ చూపిస్తూ మిగిలిన రాష్ట్రాల వారికి ఎంతో మాదిరి కలిగి ఉన్నారు. ఇలాంటి మాదిరి రాబోయే సంవత్సరాలలో కూడా కలిగి ఉండాలని ఆశిద్దాం.

మన ప్రియ సహోదరి కరుణా ప్రేమ్ ఆరోగ్య విషయమై ప్రార్థించారు. కరుణా సంపన్నుడైన దేవుడు కనికరించి ఆపరేషన్‌లో గొప్ప సహాయం చేశాడు. ఆపరేషన్ చేసి ట్రీట్‌మెంట్ ఇస్తున్న డా. చిన్నబాబుగారిని మీ ప్రార్థనల్లో జ్ఞాపకం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాను. సమకూర్చబడిన ద్రవ్యమంతటిని బట్టి దేవుని ఎంతగానో స్తుతిస్తున్నాము. త్యాగపూరితంగా పంపిన మీ అందరికీ హృదయపూర్వక వందనాలు. సిస్టర్. కరుణ ఆరోగ్యం కొరకు మీ అనుదిన ప్రార్థనల్లో జ్ఞాపకం చేసుకోవాలని కోరుతున్నాను.

> *గమనిక: ఏసియం-2021 నిర్ణయం ప్రకారం ఇయు, ఇజియఫ్‌లలో ధనం మిగిలుంటే దానిలో అవసరాల నిమిత్తం 20% ఉంచుకొని మిగిలినది నంబూర్ ఆఫీస్‌కు పంపగలరు.*

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2021 తర్వాత పెరిగిన 18% బడ్జెట్‌కు అనుగుణంగా 42 ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపిస్తున్నాయి. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మిగిలిన ఇజియఫ్‌లు కూడా ప్రార్థించి సహకరించవలసిందిగా కోరుచున్నాము.
2. యుఇయస్ఐ నేషనల్‌కు ప్రతి నెల ఆఫీస్ నుంచి పంపే కాంట్రిబ్యూషన్స్ 75,000/- నుంచి 80,000/- రూ. పెంచడానికి స్టేట్ యాన్యువల్ కౌన్సిల్‌లో నిర్ణయించారు. పెరిగిన 5,000/- కొరకు
3. స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
4. యాన్యువల్ ఇంక్రిమెంట్, నూతన కో-ఆర్డినేటర్స్ నియామకాల వలన అవసరమైన అదనపు ధనం 60 వేల కోసం
5. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,10,000/- (18% Hike W.R.T present income)**

**MARCH 2022**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 69.00 | Field Staff Salaries | 4,51,416.00 |
| General Fund | 10,40,829.00 | Field Staff HRA, CA, MA & TA | 2,47,241.00 |
| Staff Support | 76,000.00 | Office Staff Salaries | 1,54,285.00 |
| Rajasthan | 10,000.00 | UESI | 80,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Office Expenditure | 20,428.00 |
| | | to SWF | 1,25,528.00 |
| **Total** | **11,26,898.00** | | **11,26,898.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-04-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# A famous Indian Women Leader

## PANDITA RAMABAI (1858-1922)

Pandita Ramabai had memorized 18,000 Sanskrit verses by the time she was 12 years old. Her father, a Brahmin priest and wandering guru, believed in education for women, contrary to Hindu practices of his day. After her parents died of starvation, she and her brother launched on a religious pilgrimage for 4,000 miles throughout India, seeking truth. While living in Calcutta, Pandita was exposed to Christianity and thereafter continued to compare Christian and Hindu scriptures. As she read the Hindu scriptures, she discovered they all had a very low view of women.

Pandita decided to help raise the standard of women, children and widows in India. In 1880 there were twenty-three million widows in India; 51,000 below age 10, 10,000 below age 4. They were blamed for the deaths of their husbands and were made to shave their heads and wear white, a sign of mourning, for the rest of their lives. When Pandita, herself, became a widow after only 19 months of marriage, she became even more aware of the social rejection and degraded position widows suffered in India.

In 1883 Pandita visited England where she saw the tremendous difference between Christianity and Hinduism in the treatment of women. She wrote, "I realized after reading the fourth chapter of John's gospel, that Christ was truly the Divine Savior He claimed to be, and no one but He could transform and uplift the downtrodden womanhood of India and of every land."

She returned to India to open a school and home for illegitimate children, widows and orphans. She named her mission, "Mukti" which means salvation. (This mission continues to operate today.) Over the years her mission grew to include the care of unwanted babies, training for the blind, and solace for the crippled. She organized bazaars so women could sell their crafts and set up skills-training programs. The orchards and gardens surrounding the mission provided food for hundreds.

During the famine of 1896, Pandita traveled around India to collect 600 starving widows and children and to bring them back to the mission. A great revival broke out at the mission during the overcrowded days of the famine and hundreds of girls were converted. During the last 15 years of her life, Pandita translated the entire Bible into Mahrathi, the only complete translation in the world done by a woman. As she lay on her deathbed, she asked God to spare her long enough to do the final proofreading of the translation. God answered her prayer, and on the tenth day, when she had proofed the last page, she peacefully fell asleep.

- Adapted from Women as Risk Takers for God, by
**Lorry Lutz**